**విలేఖరులు కావలెను**

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com

ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :101 నల్గొండ | ఆదివారం 06-07-2025 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | పేజీలు : 4 | వెల : రూ.1/-

## రండి..కలిసికట్టుగా ముందుకు సాగుదాం..



హైదరాబాద్, జులై 5: వాయిస్ ఫర్ ది వాయిస్ లెస్ అనే థీమ్‌తో తమ బాధను చెప్పుకోలేని వారికి రక్షణ కల్పించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర స్థాయి సమావేశం ఏర్పాటు చేయడం చాలా అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు (శనివారం) ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బాలల లైంగిక వేధింపులు, రక్షణ అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో సీఎం పాల్గొని ప్రసంగించారు. ఎంతో కీలకమైన అంశంపై సదస్సు నిర్వహిస్తున్న తెలంగాణ పోలీస్, ఇతర నిర్వాహకులను సీఎం అభినందించారు. ఇలాంటి నేరాలను నియంత్రించడమే కాకుండా బాల బాధితులకు చట్టపరమైన అన్ని రకాల రక్షణ కల్పించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. లైంగిక వేధింపుల నుంచి అన్ని రకాలుగా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు.పిల్లలు, మహిళల రక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. బాలికల సంరక్షణ కోసం తెలంగాణ 'భరోసా' ప్రాజెక్టును తీసుకొచ్చిందని.. అనుసంధానంగా 29 కేంద్రాలు పనిచేస్తున్నాయని వెల్లడించారు. ఈ కేంద్రాల ద్వారా పోలీసు సహాయమే కాకుండా న్యాయపరమైన సహాయం, వైద్య సహాయం, కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భరోసా కేంద్రం ద్వారా చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని అన్నారు. కేసులను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా పిల్లలకు సంపూర్ణ రక్షణ, వారిలో విశ్వాసం, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడమే ఈ కేంద్రాల లక్ష్యమని చెప్పుకొచ్చారు. పోక్సో చట్టం, జ్యువెనైల్ చట్టాలు మన ప్రగతిశీల సాధనాలుగా పనిచేస్తున్నాయని... అయితే ఆచరణలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి హాని కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు.సోషల్ మీడియా ద్వారా పిల్లలపై జరిగే దురాఘతాలు, దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల ఎలాంటి కరుణ చూపకుండా దోషుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. న్యాయం కేవలం కోర్టుల్లోనే కాకుండా ప్రతీ దశలోనూ రక్షణ ఉండాలని సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్, బాలల సంక్షేమ కేంద్రాలతో అన్ని ప్రక్రియల ద్వారా పిల్లలకు న్యాయం దక్కాలని.. రక్షణ కల్పించాలని తెలిపారు. 'న్యాయమూర్తులు, పోలీసు అధికారులు బాలల సంక్షేమ కమిటీలు, ఇతర అభివృద్ధి భాగస్వామ్య సభ్యులందరికీ... విజ్ఞప్తి చేస్తున్నాను. ఇలాంటి విషయాల్లో అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం. న్యాయమంటే కేవలం శిక్షలు విధించడం వరకే కాదు. బాధితుల జీవితానికి భరోసా కల్పించాలి. వారికి అవసరమైన రక్షణ, సమాజంలో తగిన గౌరవం కల్పించేలా చర్యలు తీసుకుని వారి బాల్యాన్ని తిరిగి పొందేలా చర్యలు ఉండాలి' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావు

హైదరాబాద్,జూలై5: భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.రామచందర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాషాయ నేతలు ఆయన్ను గజమాలతో సత్కరించారు.హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను రామచందర్ రావుకు కిషన్ రెడ్డి అప్పగించారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షుడికి బీజేపీ శ్రేణులు అభినందనలు తెలిపారు. బాధ్యతల స్వీకరణ అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి అధ్యక్షుడి వరకు రావడం బీజేపీలోనే సాధ్యమని.. ఇందుకు తన ఎన్నికే నిదర్శనమన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్తామని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతామన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ చేసిన రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగలేదని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలిసి ఇష్టమొచ్చినట్లు హామీలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు ఉసురు తగులుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతు భరోసా ఇచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా కొరతపై దుష్ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను తప్పుదోవ పట్టిస్తుందని మండిపడ్డారు. కేంద్రం ఇచ్చిన యూరియాను రాష్ట్ర పాలకులు తినేశారా అని ఆరోపించారు. మోడీ, బీజేపీని తిట్టడమే కాంగ్రెస్ సామాజిన న్యాయ సభ ఉద్దేశమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ, పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. అంతకుముందు తన నివాసం నుంచి ర్యాలీగా వచ్చిన రామచందర్‌రావు ఉస్మానియా వర్సిటీలోని సరస్వతీ దేవాలయంలో, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీజేపీ విధానాలు నచ్చనివారు పార్టీని వీడినా నష్టం లేదంటూ వ్యాఖ్యానించారు. బీజేపీ విధానాలు, నిర్ణయాలు నచ్చక ఎవరు పార్టీని వీడినా నష్టం లేదని రామచంద్రరావు అన్నారు. పార్టీని నమ్ముకున్నవారిని బీజేపీ ఎప్పుడూ



మోసం చేయదని, అందుకు తానే ఉదాహరణ అని చెప్పారు. పార్టీ అభివృద్ధికి పని చేసిన వారందరికీ అవకాశాలు వస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ దోపిడీకి తెలంగాణ అక్షయ పాత్రగా మారిందని బిజెపి తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆరోపించారు. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కాంగ్రెస్ పార్టీ దోపిడీకి అక్షయపాత్రలుగా మారాయని వ్యాఖ్యానించారు. ఏడాదిన్నర కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఒక్క హామీని కూడా సమర్థంగా అమలు చేయలేకపోందని, ప్రజలకు ఏం సమాధానం చెబుతుందని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ సందర్భంగా రామచంద్రరావు స్పందిస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో 6 గ్యారంటీ-లు, 13 హామీలు అంటూ భారీగా హడావుడి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఏ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని అన్నారు. కులగణన పేరిట బీసీలకు అన్యాయం చేసి, ముస్లింలను బీసీ కోటాలో చేర్చడమే కాంగ్రెస్ సామాజిక న్యాయమా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు మళ్లీ మోసపోరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 70 ఏళ్ల పాలనలో వెనుకబడిన వర్గాల వారిని ఎన్నడూ ప్రధానమంత్రి గాని ముఖ్యమంత్రిగా చేయలేద ని విమర్శించారు.

## ఠాక్రేలను కలపడానికి,బాలాసాహెబ్ చేయలేనిది ఫడ్నవీస్ చేశారు..

ముంబై:20 ఏళ్లుగా శత్రువుగా ఉన్న బంధవులు ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రేలు ఒకే వేదికను పంచుకుంటూ, తాము కలిసిపోయినట్లు ప్రకటించారు. శివసేన(యూబీటీ), మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన(ఎంఎన్ఎస్) అధ్యక్షుల కలయిక రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.బాల్ ఠాక్రే కూడా చేయలేని పనిని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ చేశారని రాజ్ ఠాక్రే అన్నారు. వివాదాస్పద త్రిభాష సూత్రంపై వ్యతిరేకత వ్యక్తం చేస్తూ, మరాఠీ ప్రజలపై హిందీ రుద్దే ప్రయత్నం చేస్తున్నారంటూ ప్రభుత్వంపై విమర్శలు చేసిన వీరిద్దరిని, హిందీ వ్యతిరేకత కలిపింది. ప్రాథమిక పాఠశాలల్లో హిందీని మూడో భాషగా తప్పనిసరి చేయాలనే నిర్ణయాన్ని ఫడ్నవీస్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది.'ఆవాజ్ మరాఠీ చా' (మరాఠీ స్వరం) విజయోత్సవ ర్యాలీని ఉద్దేశించి రాజ్ మాట్లాడుతూ.."మహారాష్ట్ర రాజకీయాలు, పోరాటాల కన్నా గొప్పదది. నేడు 20 ఏళ్ల తర్వాత ఉద్ధవ్, నేను కలిసి వచ్చాము. మా ఇద్దరి కలిపేందుకు బాలాసాహెబ్ ఠాక్రే చేయలేనిది, దేవేంద్ర ఫడ్నవీస్ చేశారు." అంటూ విమర్శలు గుప్పించారు. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలతో సహా ముంబై పౌర సంస్థకు జరిగే ఎన్నికల్లో తాము ఇద్దరం కలిసి పోటీ చేస్తామని, మేము కలిసి ఉండటానికి కలిసి వచ్చాము అని ఉద్ధవ్ అన్నారు.చివరిసారిగా వీరిద్దరు 2005 ఎన్నికల సమయంలో ఒకే వేదికను పంచుకున్నారు. ఆ తర్వాత రాజ్ ఠాక్రే శివసేన నుంచి బయటకు వచ్చి, 2006లో ఎంఎన్ఎస్ పార్టీని ప్రారంభించారు. ఇటీవల మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో, శివసేన(యూబీటీ)కి 20 సీట్లు రాగా, ఎంఎన్ఎస్ ఒక్కసీటు కూడా గెలవలేకుండా పోయింది. అయితే, హిందీని మూడో భాషగా చేస్తూ ఫడ్నవీస్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. అయితే, దీనిపై వ్యతిరేకత రావడంతో ఆ ఉత్తర్వులను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో హిందీ భాష వీరిద్దరిని కలిపింది.త్రిభాషా సూత్రంపై ముంబైని మహారాష్ట్ర



నుంచి వేరు చేసే ప్రణాళిక చేస్తున్నారంటూ రాజ్ ఠాక్రే బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. "నాకు హిందీ పట్ల ఎలాంటి వ్యతిరేకత లేదు, ఏ భాష కూడా చెడ్డది కాదు. వారు మాపై హిందీని రుద్దే ప్రయోగంతో ప్రారంభించారు. మనం దానిని వ్యతిరేకించకపోతే, వారు ముంబైని మహారాష్ట్ర నుండి వేరు చేసేవారు" అని ఆరోపించారు.బీజేపీ నేత ఎల్‌కే అద్వానీ మిషనరీ పాఠశాలలో చదువుకున్నాడని, ఆయన హిందుత్వం గురించి ఎవరూ ఎలాంటి సందేహాలు లేవనెత్తలేదని చెప్పాడు. "మా పిల్లలు ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో నేర్చుకున్నారని వారు అంటున్నారు. ఫడ్నవీస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదివి మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. నా తండ్రి శ్రీకాంత్ థాకరే, అంకుల్ బాలాసాహెబ్ థాకరే ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదువుకున్నారు. మరాఠీ పట్ల వారికున్న ప్రేమ గురించి ఎవరైనా ప్రశ్నించగలరా? రేపు నేను హిబ్రూ కూడా నేర్చుకుంటాను. మరాఠీ పట్ల నాకున్న గర్వం గురించి ఎవరైనా ప్రశ్నించగలరా?" అని రాజ్ ఠాక్రే అడిగారు.

## వ్యవసాయంపై ఎక్కడ చర్చ పెట్టినా సిద్ధమే



హైదరాబాద్,వ్యవసాయంపై ఎక్కడ చర్చ పెట్టినా రావడానికి సిద్ధమని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8న సిద్ధంగా ఉంటానని, సీఎం రేవంత్‌రెడ్డి చర్చకు రావాలన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ధ్వజమెత్తారు. రైతుల బాగుపై కాంగ్రెస్ పార్టీ నేతల మాటలు.. దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎరువులు, విత్తనాల కోసం రైతులు క్యూలైన్లలో చెప్పులు పెట్టడమేనా అని ప్రశ్నించారు. కొత్త రాష్ట్రాన్ని కేంద్రం ఇబ్బందులు పెట్టినా కేసీఆర్ నిలబడ్డారని గుర్తు చేశారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. నీటికి పల్లం ఎలా తెలుసో తెలంగాణ కు నీరు ఎవరు తీసుకు వచ్చారో అందరికి తెలుసు.. తెలంగాణ లో ఏ రైతును, ఎద్దును అడిగినా వ్యవసాయం పండుగ ఎవరు చేశారో చెప్తారు.. సీఎం నిన్న రంకెలు వేశాడు.. ఆయన సభ పెట్టాడంటే బూతులతోనే మాట్లాడతాడు.. మా పార్టీ తరుపున మీ సవాలు స్వీకరిస్తున్నాం.. ఎక్కడ చర్చ పెట్టినా వస్తాం.. మీకు కేసీఆర్ అవసరం లేదు.. మేము చాలు.. 72 గంటలు ఇస్తున్నాం.. మీరు ప్రిపేర్ అయి రండి.. సీఎంకు బేసిన్ లు తెలియదు బెండకాయలు తెలియదు.. సమైక్య రాష్ట్రంలో నీళ్లు ఇవ్వలేదు కాబట్టే తెలంగాణ ఉద్యమం పుట్టింది..సీఎం రేవంత్ రెడ్డి హయాంలో నీళ్లు ఆంధ్రకు, నిధులు ఢిల్లీకి, నియామకాలు ఆయన అనునాయులకు వచ్చాయని అంటూ విమర్శలు గుప్పించారు. ఇందిరమ్మ రాజ్యం గొప్పతనం తెలియాలి అంటే బట్టలు విప్పి కొడతాం అన్నారు.. బనకచర్ల ద్వారా మీ గురువు చంద్రబాబు తీసుకెళుతుంటే మీ తీరు తెలంగాణ సమాజం చూస్తూనే ఉంది. బురద జల్లి తప్పించుకునే అలవాటు సీఎం కి ఉంది.. 8 వ తారీఖు 11 గంటలకు సోమజిగూడా ప్రెస్ క్లబ్ కు మేము వస్తాము.. మీరు రండి మీడియా ముందే చర్చిద్దాం.. కేసీఆర్ ప్రభుత్వం నాట్లు వచ్చినప్పుడు రైతు బంధు ఇచ్చేది... ఓట్లు వచ్చేముందు రైతు భరోసా ఇస్తుంది కాంగ్రెస్.. ఇప్పటి వరకు రైతులకు ఎకరానికి 19 వేలు ఎగ్గొట్టారు. అన్నదాతకు సున్నం పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం.. మందికి పుట్టిన బిడ్డలు నా బిడ్డలు అనడానికి సిగ్గు లేదా.. మేము ఇచ్చిన ఉద్యోగాలు మీరు ఇచ్చినట్లు- చెప్పుకుంటున్నారు.. అశోక్ నగర్ లో చర్చకు వస్తావా.. ఈ మూడు రోజులు మీకు టైం ఇస్తున్నాం.. అప్పటివరకు మీరు చెప్పకుంటే.. 8వ తేదీన మేము సోమజిగూడా ప్రెస్‌క్లబ్ లో సిద్ధం గా ఉంటాం.. మీలాగా మందబలంతో కాకుండా 10,15 మందితో వస్తాం.. ఈయన ఇచ్చే డబ్బులతో ఢిల్లీ టకీ టకీ అని మోగుతున్నాయి.. కాంగ్రెస్ ఎమ్మెల్యే చెప్పినట్లు- చంద్రబాబు కోవర్ట్ రేవంత్ రెడ్డినే.. ఆ ఎమ్మెల్యే చాలా కరెక్టు గా చెప్పాడు.. అలా చెప్పిన ఎమ్మెల్యేను అభినందిస్తున్నాను అని కేటీఆర్ తెలిపారు.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు...



హైదరాబాద్, జులై 5: ఆర్టీసీలో 151 మండల మహిళా సంఘాల గ్రూప్‌లకు (అద్దె బస్సుల యజమానులకు) రూ.1.05 కోట్ల రూపాయల చెక్కును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క అందజేశారు. అనంతరం మహిళా రచయితలు, కవులు రాసిన మహాలక్ష్మి (మహిళా సాధికారత లో ప్రగతి చక్రాలు) పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మహిళా సమాఖ్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని.. ఇప్పటికే మహిళల అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. త్వరలో మరిన్ని కార్యక్రమాలు చేస్తామని వెల్లడించారు. అవకాశాలు ఉన్న ప్రతీ దగ్గర వ్యాపారం కోసం మహిళా సమాఖ్యలకు ఇస్తామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరీమణులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను గ్రౌండ్ లెవెల్లో తెలిసేలా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈనెల 10 నుంచి 16 వరకు రాష్ట్ర వ్యాప్తంగా వడ్డీలేని రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం ప్రజలదన్నారు. కుటుంబ పెద్దలు ఆర్థికంగా ఎదిగేలా చేస్తే.. రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళా అభివృద్ధిలో తెలంగాణను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**నష్టాల నుంచి లాభాల్లోకి ఆర్టీసీ: మంత్రి పొన్నం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ మరోసారి బతికిందన్నారు. త్వరలోనే దాదాపు 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసిన రికార్డు నమోదు కాబోతుందని తెలిపారు. 6500 కోట్ల రూపాయల విలువైన ఉచిత ప్రయాణం నమోదు కాబోతుందని.. ఈ డబ్బులను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా గ్రామ గ్రామాన సంబరాలు నిర్వహించాలని పిలుపిచ్చారు. ఈ మహాలక్ష్మి పథకం విజయవంతం కావడం కోసం డ్రైవర్లు, కండక్టర్‌లు చాలా కష్టపడుతున్నారని వారికి అభినందనలు తెలియజేశారు. ఆర్టీసీలో కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామని.. కొత్త నియామకాలు చేస్తున్నామని చెప్పారు. మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా ఆర్టీసీ ఉచిత బస్సును వాడుకుంటున్నారన్నారు. ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల్లోకి వెళ్తోందని మంత్రి ప్రభాకర్ వెల్లడించారు.

**మహిళల ఎదుగుదలే సమాజ ఎదుగుదల: మంత్రి సీతక్క**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 24 గంటల్లోపే మహిళలకు ఉచిత బస్సు పథకం తెచ్చిందని మంత్రి సీతక్క అన్నారు. ఉచిత ప్రయాణమే కాదు మహిళలను బస్సులకు ఓనర్లను చేసిందన్నారు.మహిళల ఎదుగుదలనే సమాజ ఎదుగుదల అని ఆ స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు.

## రాజాసింగ్‌ను వదిలించుకునేందకు సిద్ధం

హైదరాబాద్,జూలై5: పంటి కింద రాయిలా పరిణమించిన గోషామహల్ శాసనసభ్యుడు రాజాసింగ్‌ను వదిలించుకోవాలని బీజేపీ భావిస్తున్నట్టు- తెలుస్తున్నది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక తీరుపై కేంద్ర నాయకత్వం మీద నిరసన గళం విప్పిన రాజాసింగ్ ఏకంగా పార్టీకి రాజీనామా చేస్తూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ లేఖ ఆధారంగా స్పీకర్‌కు లేఖ రాసి తన అసెంబ్లీ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయించాలని మాట్లాడారు.

తాను ఇక ఏమాత్రం బీజేపీ సభ్యుడిని కానని కూడా ప్రకటించారు. దీంతో ఇదే అదునుగా ఆయనను పార్టీ నుంచి బయటకు పంపాలని రాష్ట్రంలోని పలువురు నేతలు పావులు కదుపుతున్నట్టు- తెలిసింది. పలుమార్లు పార్టీని, పార్టీ నేతలను ఇరుకున పెట్టేలా వ్యవహరించిన రాజాసింగ్‌ను వదిలించుకోవడానికి ఇదే కలిసి వచ్చిన సమయమని వారు భావిస్తున్నట్టు సమాచారం. ఇంకెంతకాలం ఆయనను భరించాలని పలువురు నేతలు పార్టీ అధిష్ఠానం పెద్దల వద్ద ప్రస్తావించినట్టు తెల్సింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, సంస్థాగత వ్యవహారాల జాతీయ కార్యదర్శి తదితరులకు ఇదే విషయాన్ని రాష్ట్ర పార్టీ నివేదించినట్టు- సమాచారం. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కేంద్ర పార్టీకి ఒక లేఖను కూడా పంపినట్టు- తెలిసింది. లేఖపై సంతకం చేసిన వారిలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్, కొత్త అధ్యక్షుడు రాంచందర్‌రావు సహా ముఖ్య నేతలంతా ఉన్నట్టు- చెప్తున్నారు. కేంద్ర నాయకత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ ఇస్తే స్పీకర్‌కు రాజాసింగ్‌పై పార్టీ నిర్ణయాన్ని వివరిస్తూ లేఖ రాయాలని



నిర్ణయించినట్టు- తెలిసింది. పార్టీ ఆదేశాలు వస్తే అప్పుడు స్పీకర్‌కు లేఖ ఇస్తామని బీజేపీకి చెందిన కీలక నేత ఒకరు వెల్లడించారు. ఒకవేళ బీజేపీ కేంద్ర నాయకత్వం సమ్మతిస్తే జూలై నెలాఖరులోపే రాజాసింగ్ వ్యవహారం తేలిపోతుందని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. పార్టీతోపాటు- అసెంబ్లీ స్పీకర్ కూడా ఆయన రాజీనామాను ఆమోదిస్తే గోషామహల్‌లో ఉప ఎన్నిక తప్పదని తెలుస్తున్నది. జూబ్లీహిల్స్‌తోపాటే గోషామహల్‌కు కూడా ఉప ఎన్నిక జరిగే అవకాశాలు ఉంటాయి. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు అక్టోబర్‌లో షెడ్యూల్ విడుదల కానుంది. అప్పుడే రాష్ట్రంలోని ఈ రెండు నియోజకవర్గాలకు కూడా ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది.

## సంపాదకీయం

**ఆదివారం 06-07-2025**

# చైనా తోడుగా పాక్ పన్నాగాలు

ఇటీవల చైనాలోని చింగ్‌డావ్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) రక్షణ మంత్రుల సభ సంయుక్త ప్రకటనపై సంతకం చేయడానికి భారత్ నిరాకరించింది. పహల్గాంలో పాక్ ప్రేరిత ఉగ్రవాదుల దాడిని ఆ ప్రకటన ఖండించకపోవడమే దానికి కారణం. ఉగ్రవాదాన్ని నిరోధించడంపై చైనా ద్వంద్వ వైఖరులను ఈ సమావేశం బట్టబయలు చేసింది. పాకిస్థాన్‌ను అదెంతగా వెనకేసుకొస్తోందో కూడా చూపించింది. ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం ఏ రూపంలో ఉన్నా సభ్యదేశాలన్నీ కలిసికట్టుగా పోరాడాలని షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) నిబంధనావళిలో మొదటి అధికరణ నిర్దేశిస్తోంది. ఎస్‌సీవో పరిధిలోని ప్రాంతాల్లో ఉగ్రవాదంపై పోరుకు ప్రాంతీయ ఉగ్రవాద నిరోధ వ్యవస్థను 2002లోనే ఏర్పాటు చేశారు. అయినా పహల్గాం ఉగ్రదాడిపై ఇటీవలి సదస్సులో పన్నెత్తు మాట అనకపోవడం ఎస్‌సీఓ సంస్థాపక సూత్రాలను మంటగలపడమే అవుతుందని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లు తేల్చి చెప్పారు. ఎస్‌సీవో సభ్యదేశాల్లో భారత్, రష్యా, చైనా, పాకిస్థాన్‌లకు అణ్వస్త్రాలు ఉన్నాయి. శాంతి సామరస్యాలను కాపాడటానికి ఈ దేశాలు మరింత బాధ్యత వహించాలి. ఉగ్రవాదుల చేతికి జనహనన ఆయుధాలు చిక్కకుండా జాగరూకత పాటించాలి. అయినా పహల్గాం దాడి వెనక పాక్ హస్తం ఉండటం ఎస్‌సీవో ఆశయాలకే విరుద్ధం. అందుకే భారత్ ఉగ్రవాద అంశాన్ని ప్రస్ఫుటంగా లేవనెత్తింది.

డ్రాగన్ సైంధవ పాత్ర

ఎస్‌సీవో ఉగ్రవాదాన్ని ముక్తకంఠంతో ఖండించకపోతే పాకిస్థాన్ దాన్ని అలుసుగా తీసుకుని ముష్కరులను మరింత ఎగదోస్తుంది. దీన్ని నిరోధించడానికి ఎస్‌సీవోతోపాటు అంతర్జాతీయ సంస్థల నుంచి నిరంతరం ఒత్తిడి పెంచాలని దిల్లీ భావిస్తోంది. సంయుక్త ప్రకటన ఉగ్రవాదాన్ని ఖండించకపోయినా భారత్ దానిపై సంతకం చేస్తే పాక్, చైనాలకు అలుసు ఇచ్చినట్లవుతుంది. ఇతర విషయాల్లోనూ రాజీపడేలా మనపై ఒత్తిడి పెరుగుతుంది. దీన్ని నివారించడానికే ఎస్‌సీవోలో ఉగ్రవాదంపై ఇండియా రాజీలేని వైఖరి అవలంబించింది. చైనాకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే పహల్గాం దాడిని ఎస్‌సీవో సంయుక్త ప్రకటన ఖండించేలా చర్యలు తీసుకుని ఉండేది. ఆ పని చేయలేదు. పైగా బలూచిస్థాన్ సమస్య గురించి సంయుక్త ప్రకటన ప్రస్తావించడం పాక్, చైనా కుమ్మక్కవడాన్ని బయటపెడుతోంది. మొత్తానికి అంతర్జాతీయ వేదికలపై చైనా- పాకిస్థాన్ కొమ్ముకాస్తూనే ఉంటుందని మరోసారి రుజువైంది. భారత్ విషయంలో అయితే చైనా నోరు మాట్లాడుతుంటే నొసలు వెక్కిరిస్తాయని తేలిపోయింది. భారత్ అగ్రశక్తిగా ఎదగడం చైనాకు సుతరామూ ఇష్టంలేదు. అందుకే పాక్ శిఖండిని మనపైకి ఉసిగొల్పుతూ ఉంటుంది. ఉగ్రవాదంపై భారత్ ఆందోళన, నిరసనలు, విధానాలు ఎస్‌సీవోతో పాటు ఇతర అంతర్జాతీయ సంస్థల అజెండాలో చేరకుండా చైనా సైంధవుడిలా అడ్డుపడుతూనే ఉంటుంది. ఈ పరిస్థితిలో ఎస్‌సీవో నుంచి ఇండియా వైదొలగాలా అనే ప్రశ్న తలెత్తుతుంది. దానికి 'వద్దు' అనే జవాబివ్వాలి. ఇండియా ఎస్‌సీవోలో సభ్యదేశం కాకుంటే, ఆ సంస్థ భారత్‌కు వ్యతిరేకంగా తీర్మానాలు చేసి ఉండేది. ఇండియా ప్రయోజనాలకు విరుద్ధమైన చర్యలు తీసుకుని ఉండేది. పైగా ఎస్‌సీవోలో ఆర్థికంగా బలీయమైన దేశాల్లో భారత్ కూడా ఒకటి కాబట్టి చైనా, పాక్ మినహా ఇతర సభ్యదేశాలు మనతో వాణిజ్య, ఆర్థిక పొత్తులకు ప్రాధాన్యమిస్తూనే ఉంటాయి. ఎస్‌సీవోలో మధ్యాసియా దేశాలు ముఖ్యమైన భాగస్వాములు కాబట్టి వాటితో ఆర్థిక బంధాన్ని పటిష్ఠం చేసుకోవాలని దిల్లీ లక్షిస్తోంది. ఇరాన్‌లోని చాబహార్ రేవు నుంచి అఫ్గానిస్థాన్ మీదుగా మధ్యాసియాకు రవాణా మార్గాన్ని ఏర్పరచుకోవడం ద్వారా అక్కడి అమూల్య ఖనిజ వనరులను భారత్ దిగుమతి చేసుకోవడం వీలవుతుంది.

జేబు సంస్థగా మార్చుకోవాలని...

చింగ్‌డావ్‌లో పాక్, చైనాలు ప్రదర్శించిన వికట క్రీడ ఎంతోకాలం సాగకపోవచ్చు. కొద్ది నెలల్లో ఎస్‌సీవో విదేశాంగ మంత్రుల సమావేశం జరగనుంది. అందులో ప్రాంతీయ భద్రత గురించి మళ్లీ ప్రస్తావన వస్తుంది. అక్కడ మరోసారి పాకిస్థాన్, చైనాల ద్వంద్వ క్రీడను ఎండగట్టడానికి ఇండియా తప్పక ప్రయత్నిస్తుంది. ఎస్‌సీవోను తన జేబు సంస్థగా మార్చుకోవాలని చైనా పన్నాగం పన్నుతోంది. దాన్ని భారత్, రష్యాలు సాగనివ్వవు. ఏకాభిప్రాయంపై ఆధారపడి నిర్ణయాలు తీసుకోవాలని పట్టుబడతాయి. మొన్నటి ఎస్‌సీవో సంయుక్త ప్రకటన పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావించకపోయినా, జులై ఒకటిన సమావేశమైన క్వాడ్ విదేశాంగ మంత్రులు దాన్ని నిర్ద్వంద్వంగా ఖండించారు. ఈ దాడికి కారకులను కఠినంగా శిక్షించాలని సూచించారు. క్వాడ్‌లో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలు సభ్యదేశాలు. చైనా, పాక్‌ల లాలూచీ ఎస్‌సీవో ఐక్యతకు మంచిది కాదని ఇతర సభ్యదేశాలు గ్రహించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

# అభయహస్తం రైజింగ్! ప్రజాసంక్షేమ రాష్ట్రంగా తెలంగాణ



హైదరాబాద్,ఆర్థికాభివృద్ధి, మానవ వనరుల అభివృద్ధితోపాటు ప్రజాసంక్షేమ కార్యక్రమాల్లో ప్రపంచానికి తెలంగాణ దిక్సూచి కావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం తెలంగాణ రైజింగ్ విజన్-2047 డాక్యుమెంట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని భాగంగా చేసింది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను పకడ్బందీగా లబ్ధిదారులందరికీ అందేలా చూడటం, రైతు సంక్షేమం కోసం రైతు భరోసా, వరి ధాన్యానికి బోనస్, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని ఈ డాక్యుమెంట్‌లో ప్రతిపాదించనున్నట్టు తెలుస్తోంది.

మహిళలకు వరంగా పథకాలు..

అంతేకాకుండా.. గృహ జ్యోతిపథకం ద్వారా 200 యూనిట్ల విద్యుత్‌ను 32 లక్షల కుటుంబాలకు రేవంత్ సర్కారు అందిస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ?500 గ్యాస్ సిలిండర్ పంపిణీ వంటి పథకాలు లబ్ధిదారులందరికీ అందే ప్రణాళికలను ఈ విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆయా ప్రజా అవసరాలను గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి లబ్ధి కలగాలన్న లక్ష్యంతో ప్రజాసంక్షేమాన్ని తెలంగాణ రైజింగ్-2047లో భాగం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పారదర్శక పాలనలో మార్గదర్శిగా తెలంగాణ

పారదర్శక పాలనలో మార్గదర్శిగా నిలవాలన్న లక్ష్యాన్ని తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరచాలని ప్రభుత్వం నిర్ణయించింది. సరైన పాలన అందించడం, ప్రతీ నిర్ణయం పారదర్శకంగా, ప్రజలకు జవాబుదారీ తనంతో ఉండేలా లక్ష్యాలను నిర్దేశించుకోనుంది. ఇందుకోసం టీఎస్పీఎస్సీ, లోకాయుక్త, మానవహక్కుల కమిషన్ వంటి సంస్థలను బలోపేతం చేయడం ఇందులో భాగంగా చెప్పవచ్చు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని కూడా సీఎం రేవంత్ సర్కారు నిర్ణయం తీసుకుని కఠిన చర్యలు చేపడుతోంది.

అన్నింటికీ అభయహస్తంలా..

పలు కీలక అంశాలనే ఓ రోడ్ మ్యాప్‌గా తీసుకుని తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంట్‌ను రూపొందించవచ్చని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి, హైదరాబాద్ నగర అభివృద్ధి, మానవ వనరులు- నైపుణ్యాభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన వంటి ఐదు అంశాలు కీలకమని కాంగ్రెస్ పెద్దలు చెబుతున్నారు. అయిదు వేళ్లతో హస్తం ఎలా రూపొందుతుందో.. ఈ ఐదు అంశాలతో విజన్ డాక్యుమెంట్ సమగ్రంగా రూపుదిద్దుకుంటుందని చెబుతున్నారు.

పాలకులు మారినా విధానాలు మారలేదు

"తెలంగాణ ఆవిర్భవించాక పాలకులు మారినాపరిశ్రమలను ప్రోత్సహించే విధానాల్లో మార్పు రాలేదు. అందుకే హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు గత 30 ఏళ్లుగా పెట్టుబడుల ప్రవాహం ఆగలేదు. జంటనగరాల తర్వాత సైబరాబాద్‌ను చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభివృద్ధి చేశారు. ఫ్యూచర్ సిటీ పేరుతో మేం మహేశ్వరం మండలంలోని ముచ్చర్ల-బేగరికంచ గ్రామాల మధ్య నాలుగో నగరాన్ని సృష్టిస్తున్నాం. మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి జపాన్, అమెరికా, సింగపూర్, స్విట్జర్లాండ్ (దావోస్) వెళ్లినప్పుడు ప్రపంచవ్యాప్తంగా మెరుగైన సౌకర్యాలున్న నగరాలతో పోటీపడాలని నిర్ణయం తీసుకున్నాం. అందుకనుగుణంగానే కార్యాచరణ రూపొందించాం" అని ముఖ్యమంత్రి రేవంత్? పలు వేదికలలో స్పష్టం చేశారు.

అన్నిశాఖలు సమాయత్తం..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ రైజింగ్- 2047 లక్ష్యం దిశగా ప్రభుత్వ యంత్రాంగాన్ని సమాయత్తం చేసేందుకు విభాగాల వారీగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ 'మిషన్ కర్మయోగి' అధికారుల బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో భేటీ అయింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, సిబ్బందిలో నైపుణ్యాభివృద్ధికి మిషన్ కర్మయోగి చేపట్టిన శిక్షణ కార్యక్రమాలను 'కెపాసిటీ బిల్డింగ్ కమిషన్' అడ్మినిస్ట్రేషన్ సభ్యురాలు డాక్టర్ అల్కా మిత్తల్ వివరించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ..'ఇప్పటికే తెలంగాణలో డాక్టర్? మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణ పోలీస్ అకాడమీ, ఫారెస్ట్ అకాడమీ, ఎక్సైజ్ అకాడమీ తదితర సంస్థలు సమర్థంగా పలు శిక్షణ కార్యక్రమాలు చేపట్టి, ప్రభుత్వ సిబ్బంది, అధికారులకు మార్గనిర్దేశం చేస్తున్నాయి' అని తెలిపారు.

### స్కూల్ బస్సు కిందపడి చిన్నారి మృతి

నంద్యాల,నంద్యాల జిల్లాలో దారుణం జరిగింది. పాఠశాలకు వెళ్లిన తొలిరోజే ఓ చిన్నారి స్కూల్ బస్సు చక్రాల కింద పడి మృతి చెందింది. ఈఘటన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలో జరిగింది. ఎంవీ నగర్‌కు చెందిన శ్రీధర్, వనజ దంపతుల కుమార్తె హరిప్రియ (5). ఓ ప్రైవేటు- పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. ఉదయమే చిన్నారి తొలిసారి పాఠశాలకు వెళ్లింది.

# బీజేపీపై ఆర్‌ఎస్‌ఎస్ పట్టు బిగిస్తోందా?

న్యూఢిల్లీ,దశాబ్దకాలంగా బీజేపీలో అప్రతిహత నిర్ణయాలు తీసుకున్న మోదీ - షా ద్వయం ఈ సారి మాత్రం ఆర్ఎస్ఎస్ ఆమోదంతోనే నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఉత్పన్నమైంది. 2024 ఎన్నికల్లో బిజెపి సొంతంగా మెజారిటీ సాధించకపోవడంతో కమలదళంపై ఆర్ఎస్ఎస్ తిరిగి పట్టు బిగించడం ప్రారంభించింది. వచ్చే ఎన్నికల్లో ఆర్ఎస్ఎస్ సహకారం లేకపోతే పరిస్థితి భిన్నంగా ఉంటుందనే విషయాన్ని గమనించిన మోదీ-షా ద్వయం ఆర్ఎస్ఎస్‌తో సంప్రదింపులు, ఆమోదం తర్వాతే పార్టీ నియామాకాలకు ముందుకువెళుతున్నారు. అయితే బిజెపి జాతీయ అధ్యక్షుడి ఎంపికపై ఏకాభిప్రాయం రాకపోవడంతో దాదాపు ఏడాదిగా ఈ నియామకం పెండింగ్‌లో పడింది. అయితే ఎట్టకేలకు గత రెండువారాల నుంచి ఆర్ ఎస్ ఎస్ ఆమోదంతో రాష్ట్రాల అధ్యక్షుల నియామాకాలు జరిగాయి. దాదాపు తొమ్మిది రాష్ట్రాలకు నూతనంగా బిజెపి అధ్యక్షుల నియామకం. ఈ నియామాకాలన్నింటిలో స్పష్టంగా ఆర్ఎస్ఎస్ ముద్ర కనిపించింది. ప్రత్యేకించి రెండు తెలుగురాష్ట్రాలలో బిజెపి అధ్యక్షుల నియామకంలో ఆర్ఎస్ఎస్ తిరుగులేని తన ఆధిపత్యాన్ని నిరూపించింది. ఆర్ఎస్ఎస్, ఏబీవీపీలో సుదీర్ఘకాలం పనిచేసి ఆ తర్వాత బిజెపిలోకి ప్రవేశించిన మాజీ ఎమ్మెల్సీలు రాంచందర్‌రావు, పివిఎన్.మాధవ్‌కు పార్టీ సారథ్య బాధ్యతలు అప్పగించింది. తెలంగాణ అధ్యక్ష పదవికోసం హేమాహేమీలు పోటీపడినా, రేసులో లేని రాంచందర్‌రావుకే నాయకత్వ పగ్గాలు అప్పగించారు. పార్టీలో విపరీతమైన గ్రూపు తగాదాల నేపథ్యంలో ఎవరికి పదవి అప్పగించినా, మరొకరు వారిని దెబ్బకొట్టే పరిస్థితి నెలకొనడంతో అందరినీ సమన్వయం చేసేందుకు సంస్థాగత నాయకుడిని సెలెక్ట్ చేసుకుంది.ఏ గ్రూపులలో లేకపోవడం, వివాదాలకు దూరంగా ఉండడం, సంఘ్ పరివార్ ఆశీస్సులు ఉండడం రాంచందర్‌రావుకు కలిసొచ్చింది. అలాగే పార్టీ వ్యవహారాలు తమ చేతిలోనే ఉండాలనే ఉద్దేశంతో సీనియర్‌లు కూడా రాంచందర్‌రావుకు మద్దతు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో మెజారిటీ సంఖ్యలో ఉన్న బీసీ, రాజకీయంగా, ఆర్థికంగా బలమైన రెడ్డి సామాజిక వర్గాల నుంచి ఎంపీలు అధ్యక్షపదవిని ఆశించినా, వారిని కాదని బ్రాహ్మణ వర్గాన్నే అధ్యక్ష పదవి వరించింది. ప్రతిపక్షంలో ఉండే ఏ పార్టీకైనా దూకుడుగా ఉండే నాయకుడు అవసరమనేది అభిప్రాయముంది. కానీ ఈసారి దూకుడు కంటే , గ్రూపిజం లేని వ్యక్తికే పగ్గాలు అప్పగించడం ద్వారా సిద్ధాంత నిబద్ధత, క్రమశిక్షణ, సమన్వయంతో పనిచేసేవారికే పెద్దపీట వేసింది. అన్ని గ్రూపుల మధ్య బ్యాలెన్స్ కోసమే ఈ నియామకం చేసినట్లుగా కనిపిస్తోంది.ఇటు ఆంధ్రప్రదేశ్‌లో సైతం మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్.మాధవ్‌కు బిజెపి సారథ్య బాధ్యతలు అప్పగించడంలో ఆర్ ఎస్ ఎస్ చక్రం తిప్పింది. మొన్నటిదాకా అధ్యక్షురాలిగా ఉన్న పురంధేశ్వరి మరోసారి తనకు అధ్యక్ష పదవి పొడగించాలని కోరారు. అయితే అధ్యక్షురాలిగా పురంధేశ్వరి పార్టీ నిర్మాణం, పార్టీ కార్యక్రమాలు సరిగ్గా నిర్వహించలేదని అధిష్టానానికి నివేదికలందాయి. దాంతో ఆమెను కొనసాగించేందుకు అధిష్టానం అంగీకరించలేదు. ఆమె స్థానంలో ఆర్ఎస్ఎస్‌కు చెందిన మాధవ్‌ను నియమించడం ద్వారా సంస్థాగత నిర్మాణంపై వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఏపీలో అధ్యక్ష పదవికోసం పెద్దగా పోటీ లేనప్పటికీ వలస నేతలకు కాకుండా ఒరిజినల్ నేతలకే కీలక బాధ్యతలు ఇవ్వాలన్న ఆర్ఎస్ఎస్ అభిప్రాయం మేరకే మాధవ్ నియామకం జరిగింది. వలసనేతలకు ఎన్నికలలో టికెట్ ఇచ్చి రంగంలోకి దింపాలే తప్ప, పార్టీ కోర్ యాక్టివిటీస్‌లో ఇన్వాల్వ్ చేయడం వల్ల పెద్దగా లాభం లేదన్నది ఆర్ ఎస్ ఎస్ అభిప్రాయంగా ఉంది.గత పదేళ్ల నుంచి బిజెపిలో నియామకాలన్నీ దాదాపుగా నరేంద్రమోడీ, అమిత్‌షా ద్వయమే ఫైనల్ చేసేది. అన్ని నియామాకాల్లోనూ వారి మాటే నెగ్గేది. వరుసగా 2014, 2019 ఎన్నికల్లో బిజెపిని అధికారంలోకి తీసుకురావడంలో మోడీ-షా ద్వయం కీలకపాత్ర పోషించింది. దాంతో వారూ కోరుకున్నట్లుగానే ఆర్ ఎస్ ఎస్ సైతం బిజెపి నిర్ణయాల్లో జోక్యం చేసుకోకుండా వారికి ఫ్రీ హ్యాండ్ ఇచ్చింది. అయితే ఒక్కసారిగా 2024లో పరిస్థితి మారిపోయింది. అబ్‌కీ బార్ చార్ సౌ పార్ ...ఈసారి 400 సీట్లు అనే గట్టి ప్రచారం చేసినా అది వర్కవుట్




కాలేదు. 2019లో వచ్చిన 304 సీట్ల నుంచి 2024కల్లా 240 సీట్లకు పడిపోవడంతో మోడీ-షా ద్వయం ప్రభ సన్నగిల్లడం మొదలైంది. మిత్రపక్షాల సహకారంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా, పార్టీలో మాత్రం మోడీ-షా నిర్ణయాలకు ఆర్ఎస్ఎస్ ఆమోదం తప్పనిసరిగా మారింది. దాని వల్లే బిజెపి అధ్యక్షుడు జెపి.నడ్డా పదవీకాలం ముగిసినా కొత్త అధ్యక్షుడి నియామకం ఎప్పటికప్పుడు వాయిదాపడుతూ వస్తోంది. జాతీయ అధ్యక్షుడి నియామకానికి దేశంలోని సగం రాష్ట్రాలలో బిజెపి అధ్యక్షుల నియామకం జరగాలనే నిబంధన ఉంది. దీనివల్లే నియామకం చేయడం లేదని బిజెపి అగ్రనేతలు బయటికి చెప్పుకున్నారు. కానీ అంతర్గతంగా మాత్రం కొత్త బిజెపి అధ్యక్షుడి నియామకంపై మోడీ-షా, ఆర్ఎస్ ఎస్ మధ్య ఏకాభిప్రాయం లేకపోవడమే ప్రధానకారణం. తమ ఆమోదం లేకుండా నియమిస్తే, రానున్న ఎన్నికల్లలో సహకారం ఉండదనిసంకేతాలిచ్చింది. ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ రాక, మిత్రపక్షాల బలంపై ఆధారపడిన మోడీ ప్రభుత్వం ఆర్ ఎస్ ఎస్ సహకారం కోల్పోతే పరిస్థితి మరింత జఠిలమవుతుంది. దాంతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ తొలిసారిగా నాగ్‌పూర్‌లోని ఆర్ ఎస్ ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి తన విధేయతను చాటారు. ఆ తర్వాత వరుసగా జరుగుతున్న అన్ని నియామాకాలు ఆర్ ఎస్ ఎస్ ఆమోదంతో కొనసాగుతున్నాయి. మహారాష్ట్ర బిజెపి చీఫ్‌గా రవీంద్ర చవాన్, ఉత్తరాఖండ్ బిజెపి చీఫ్‌గా మహేంద్రభట్, హిమాచల్‌ప్రదేశ్ అధ్యక్షుడిగా రాజీవ్ బిందల్, మధ్యప్రదేశ్ అధ్యక్షుడిగా హేమంత్ ఖండేల్వాల్, పుదుచ్చేరికి రామలింగం, మిజోరాంకు కె.బెచువా, అండమాన్ నికోబార్‌కు అనిల్ తివారిని అధ్యక్షులుగా నియమించింది. వీరంతా ఆర్ఎస్ఎస్‌కు అత్యంత సన్నిహితులే. ఈ నియామకాల ద్వారా ఆర్ ఎస్ ఎస్ తిరిగి బిజెపి పై పట్టు బిగించినట్లయింది.సగం రాష్ట్రాలకు కొత్తగా అధ్యక్షులను నియమించిన నేపథ్యంలో బిజెపి రాజ్యాంగం ప్రకారం జాతీయ అధ్యక్షుడి నియామకానికి లైన్ క్లియరైంది. అయితే అధ్యక్షుడిగా ఎవరిని నియమిస్తారనేదానిపై రకరకాల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహన్, ధర్మేంద్ర ప్రదాన్, మనోహర్‌లాల్ ఖట్టర్, భూపేంద్ర యాదవ్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరంతా ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ నుంచే బిజెపిలోకి రాజకీయ ప్రవేశం చేసి వివిధ హోదాలలో కొనసాగుతున్నారు. వచ్చే ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో తొలిసారిగా అధ్యక్ష పదవి మహిళకు అప్పగించే అవకాశముందనే ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం కేంద్ర మంత్రులు నిర్మలాసీతారామన్, శోభా కరద్లాంజె, మహిళామోర్చా అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. అయితే ఆశ్చర్యకరమైన ఎంపికలు చేసే మోడీ-షా ద్వయం ఈసారి ఆర్ఎస్ఎస్‌తో సమన్వయంతో వెళ్లాల్సి ఉంది. ఈ విషయంలో ఏకాభిప్రాయం సాధించాల్సి ఉంది. దాదాపు ఏడాదికి పైగా జాతీయ అధ్యక్షుడి నియామకంపై అనిశ్చితి కొనసాగుతోంది. బిజెపి అగ్రనాయకత్వం- ఆర్ ఎస్ ఎస్ మధ్య ఏకాభిప్రాయం లేని కారణంగానే ఆలస్యమయ్యింది. అయితే ఢిల్లీలో జరుగుతున్న ఆర్ ఎస్ ఎస్ ప్రాంత ప్రచారక్‌ల సమావేశం తర్వాత దీనిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈసారి సంఘ్ సంపూర్ణ ఆశీస్సులున్న వ్యక్తికే పార్టీ జాతీయ అధ్యక్ష పగ్గాలు అందబోతున్నాయి

# నిపుణుల సలహాలు పట్టించుకోని పాలకులు

న్యూఢిల్లీ, దేశంలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేయ లేనంతకాలం ఈ దేశం ఆర్థికంగా పురోగమించదని నిపుణులు పదేపదే సూచిస్తున్నా..అందుకు అనుగుణంగా అడుగులు వేయడం లేదు. దేశ జనాభాకు అనుగుణంగా అవసరమైన పంటలను ప్రోత్సహించాలి. వ్యవసాయ దిగుబడులను తగ్గించి, ఎగుమతులను పెంచుకోవాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలన్న సూచనలు పెడచెవిన పెడుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయానుబంధ రంగాలను బలోపేతం చేయడం మినహా మరో గత్యంతరం లేదు. అయినా ఇటువైపు పాలకులు దృష్టి సారించడం లేదు. వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురి కావడంతో ఆహారభద్రత కూడా లేకుండా పోతున్నది. ఈ క్రమంలో వ్యవసాయాన్ని బలోపేతం చేస్తు తప్ప దేశం ఆర్థికంగా అభివృద్ధి సాధించలేదు. నదుల అనుసంధానం జరగడం లేదు. పూర్తి విద్యుత్ ఉత్పత్తి దిశగా పెట్టబడులు రావడం లేదు. మన దేశం అభివృద్ధి సాధించాలంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండాలని మోడీ ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన కొత్తలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి, రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తానన్న మోడీ హామీ పదేళ్లయినా అమలు కావడం లేదు. దేశ జనాభాలో 60 శాతం మందికి పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయినా ఈ రంగాన్ని పైకి తీసుకుని రావడం, వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం జరగడం లేదు. పప్పుల ధరలు పెరుగుతున్నా, మనదేశంలో పప్పు పంటలను ప్రోత్సహించడం లేదు. నూనె ధరలు పెరుగుతున్నా, నూనెగింజల పంటలకు ప్రోత్సాహం దక్కడం లేదు. 2018-19 నాడు 7.8 శాతం అభివృద్ధితో వున్న వ్యవసాయరంగం 2024 మార్చి నాటికి 0.6 శాతానికి పడిపోయింది. వేగంగా దిగజారిపోతున్న వ్యవసాయ రంగాన్ని ఆదుకోవలసి వుంది. కానీ అలాంటి ప్రయత్నాలు జరగడం లేదు. ఆహార సబ్సిడీకి రూ. 7,082 కోట్లు తగ్గించేశారు. రానున్న రోజుల్లో ఎరువులు, పురుగు మందుల ధరలు మరింతగా పెరుగుతాయి. పంటల పెట్టుబడి సహాయం పెంచకుండా, కనీస మద్దతు ధర, ఉచిత బీమా అమలు చేయకుండా వ్యవసాయ సంక్షోభాన్ని బిజెపి ప్రభుత్వం మరింత తీవ్రం చేస్తున్నది. ఆహార సబ్సిడీ తగ్గించడంతో పేదలకు అందుతున్న రేషన్ సరుకుల కోటా తగ్గిపోతుంది. ఆకలి కేకలు పెరుగుతాయి. వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు కొంత ఊరటనిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గత బడ్జెట్‌లో కేటాయించిన రూ. 86 వేల కోట్లలో, ఇప్పటికే చేసిన పనులకు చెల్లించాల్సిన బకాయిలు 44,500 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా. ఇంత తక్కువ డబ్బుతో కోట్ల మంది పేదలకు పనులు ఎలా కల్పిస్తారన్నది అర్థం కావడం లేదు. అన్నింటికి మించి ఉపాధి పనులను వ్యవసాయానికి అనుబంధిం చాలన్న డిమాండ్ పట్టించుకోవడం లేదు. దేశంలో వ్యవసాయ కూలీలు దొరకడం లేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే సామాన్యులకు తిండిగింజలు దొరకడం లేదు. అధిక ధరలతో సామాన్యులు ఉప్పులు, పప్పులు కొనుక్కోలేక పోతున్నారు. ఈ సమస్యలను పార్లమెంటు చర్చించదు. బయటా చర్చించడం లేదు. దీంతో ప్రధాన సమస్యలపై ప్రజల ఆవేదన పట్టించుకోవడం మానేశారు.

# కాళేశ్వరం వద్ద ప్రాణహిత ఉధృతి

జయశంకర్ భూపాలపల్లి, కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది మరోసారి ఉధృతంగా ప్రవహిస్తోంది. మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో నదికి వచ్చే వరద నీటి ప్రవాహం భారీగా పెరిగింది. దీంతో పుష్కర ఘాట్ల వద్ద తాత్కాలిక వ్యాపార స్థలాలు పూర్తిగా నీట మునిగాయి. ఇప్పటి వరకు నీటి కొరతతో వెలిసిన నదీ తీరంలో గుడారాలు వేసుకుని వ్యాపార కార్యకలాపాలు సాగించిన స్థానికులు, వరద ఉధృతికి అవన్నీ కోల్పోయారు. మరోవైపు, నీటి ఉధృతి ఉన్నా కూడా భక్తులు పుణ్యస్నానాల కోసం నదిలోకి దిగుతున్న దృశ్యాలు అధికారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రమాదకర పరిస్థితుల్లో భక్తులు నదిలోకి ప్రవేశించడం పట్ల అధికారులు అప్రమత్తమవుతున్నారు. వరద ప్రవాహం పెరగడంతో నది పక్కన ఎలాంటి శాశ్వత ఏర్పాట్లు లేకపోవడం వల్ల, ప్రజలకు అవగాహన కల్పించేందుకు సిబ్బందిని మోహరించారు. ఇక ఎగువ మహారాష్ట్ర నుంచి వస్తున్న భారీ వరద నీరు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీకి చేరుతోంది. ప్రస్తుతానికి బ్యారేజీకి పై నుంచి సుమారు 84,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు 85 గేట్లను ఎత్తి, అదే స్థాయిలో నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద ఇన్‌ఎ÷-లో, అవుట్‌ఎ÷-లో సమానంగా కొనసాగుతున్న నేపథ్యంలో, దిగువన ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ వరద ఉధృతికి సంబంధించి జిల్లా పాలన యంత్రాంగం ఇప్పటికే ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. లోతట్టు ప్రాంతాలపై నిఘా పెట్టి, అవసరమైతే స్థానికులను ఖాళీ చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వరద స్థాయిలను గమనిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. భక్తులు కూడా నదిలోకి వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

# తుది దశకు చర్చలు..

న్యూఢిల్లీ,భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దిశకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రధాని మోడీ-ట్రంప్ మధ్య సంభాషణ జరిగిన తర్వాత జూలై 9కి ముందు ఒక ప్రకటన వెలువడే అవకాశం ఉందని వర్గాలు పేర్కొన్నాయి.అధికారుల స్థాయిలో చర్చలు ముగిశాయని.. కానీ మోడీ-ట్రంప్ మధ్య జరిగే రాజకీయ దిశానిర్దేశం తర్వాత ఒక క్లారిటీ వస్తుందని చర్చల్లో పాల్గొన్న వ్యక్తి వెల్లడించారు. రెండు వైపులా చర్చలు ముగిశాయని.. రెండు దేశాల అధినేతల చర్చల తర్వాతే ఫైనల్ అయ్యే ఛాన్సుందని వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఈ సమావేశం ఎప్పుడు జరుగుతుందనేది సందిగ్ధం నెలకొంది. ప్రస్తుతం మోడీ ఐదు దేశాల పర్యటనలో ఉన్నారు. ఎప్పుడు ట్రంప్-మోడీ మాట్లాడుకుంటారనే దానిని బట్టే వాణిజ్య ఒప్పందం ఫైనల్ అవుతోంది.అయితే భారత్‌లో వ్యవసాయం, పాడి శ్రమకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. అయితే ప్రాముఖ్యమైన భారతీయ రంగాలను దెబ్బ కొట్టేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. ఈ విషయంలో మోడీ సర్కార్ వెనుకంజ వేస్తోంది. పశుగ్రాసంలో ఉపయోగించే కొన్ని జన్యుపరంగా మార్పు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను అనుమతించాలనే అమెరికా అభ్యర్థనపై భారత్ వెనక్కి తగ్గుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఇరు దేశాల మధ్య చర్చలు ఫైనల్‌కు రాలేదని తెలుస్తోంది.వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ నేతృత్వంలోని భారత సంధానకర్తల బృందం.. ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి యునైటెడ్ స్టేట్స్ వాణిజ్య ప్రతినిధి బృందంతో తీవ్రమైన చర్చల్లో పాల్గొంది. జూన్ 5-10 మధ్య భారతదేశం-అమెరికా ఒక రౌండ్ చర్చలు జరిపాయి. ట్రంప్ విధించిన 26 శాతం సుంకాల నుంచి భారత్ ఉపశమనం పొందాలని చూస్తోంది. వస్త్రాలు, తోలు, పాదరక్షలు వంటి ఎగుమతులకు సుంకాల రాయితీ కోసం భారత్ ప్రయత్నిస్తోంది. ఇక జూన్ 27న మరోసారి భారత్ బృందం అమెరికాకు వెళ్లి వారం పాటు చర్చలు జరిపింది. ఈ చర్చలన్నీ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. ఎప్పుడు ఫైనల్ ప్రకటన వస్తుందో ఉత్కంఠ నెలకొంది.

## పాశమైలారం సందర్శించిన సిఎస్ రామకృష్ణారావు బృందం

సంగారెడ్డి,పాశమైలారంలోని సిగాచి ప్రమాద ఘటనా స్థలిని సీఎస్ రామకృష్ణ రావు నేతృత్వంలోని హై లెవెల్ కమిటీ పరిశీలించింది. ప్రమాద స్థలిని హైలెవల్ కమిటీ సభ్యులు పరిశీలించారు. కమిటీకి చైర్మన్‌గా సీఎస్ రామకృష్ణ రావు, సభ్యులుగా రెవెన్యూ, ఇండస్ట్రీ చీఫ్ సెక్రటరీలతో పాటు కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఫైర్ డీజీ, ఆరోగ్యశాఖ కార్యదర్శి ఉన్నారు. ఘటనా స్థలిని పరిశీలించిన తర్వాత బాధిత కుటుంబాలతో కమిటీ మాట్లాడింది. సిగాచి యాజమాన్యంతో కూడా మాట్లాడి వివరాలను సేకరించనుంది. ఇక ప్రమాద స్థలిని గురువారం నిపుణుల కమిటీ పరిశీలించిన విషయం తెలిసిందే. సుమారు మూడు నాలుగు గంటల పాటు నిపుణుల కమిటీ విచారించింది. టెక్నికల్ అంశాలపై నిపుణుల కమిటీ నెలరోజుల్లో ప్రభుత్వానికి (÷ుగ÷జీనిణజీనిజీ ఉనీలబి) నివేదిక ఇవ్వనుంది. మరోవైపు ఈ ప్రమాద ఘటనలో మరొకరు మృతి చెందారు. దీంతో సిగాచి ఘటనలో మృతుల సంఖ్య 39కి చేరింది. సిగాచి పరిశ్రమలో తీవ్రంగా గాయపడి ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భీమ్ రావు అనే వ్యక్తి శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భీరామ్ స్వస్థలం మహారాష్ట్ర. పోస్టుమార్టం అనంతరం భీమ్ రావు మృతదేహాన్ని స్వస్థలానికి పంపించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రమాద స్థలిలో ఐదవ రోజు కూడా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇక సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటనపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కీలక ప్రకటన చేశారు. ఈ ప్రమాదం నుంచి 61 మంది సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు. ఈ దుర్ఘటనలో 38 మంది మృతి చెందారని.. అందులో ఇప్పటి వరకు 31 మృతదేహాలను గుర్తించామని వెల్లడించారు. ఇంకా 7 మృతదేహాలను గుర్తించాల్సి ఉందన్నారు. ఆస్పత్రి నుంచి ఇప్పటి వరకు 12 మంది డిశ్చార్జ్ అయ్యారని.. ప్రస్తుతం ఆస్పత్రులలో 23 మంది చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. అలాగే ఇంకా 9 మంది ఆచూకీ లభించలేదని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రకటించారు. వీరి కోసం ఘటనా స్థలిలో రెస్క్యూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. సిగాచి పరిశ్రమ వద్ద బాధితుల ఆందోళన కొనసాగుతోంది. ఐదు రోజులు గడిచినప్పటికీ తమ వారి ఆచూకీ తెలియడం లేదంటూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వారితో పాటు ఏపీ రాష్ట్రంలోని శ్రీకాకుళంకు చెందిన ఓ కుటుంబం కూడా నిరీక్షిస్తోంది.

## హిమాచల్‌లో వరదబీభత్సం

సిమ్లా,హిమాచల్‌ప్రదేశ్‌పై జలఖడ్గం విరుచుకుపడింది. గత కొద్ది రోజులుగా ప్రకృతి ప్రకోపం చల్లారడం లేదు. ఓ వైపు కుండపోత వర్షాలు.. ఇంకోవైపు కొండచరియలు విరిగిపడడంతో భారీగా ప్రాణ, ఆస్తి జరిగింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు భయాందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటి వరకు 63 మంది చనిపోగా.. రూ.400 కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక డజన్ల కొద్దీ గల్లంతయ్యారు. వారి వివరాలు తెలియడం లేదు. గత కొద్ది రోజులుగా హిమాచల్‌ప్రదేశ్‌లో నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్నాయి. రుతుపవనాలు కారణంగా మేఘాలు రాష్ట్రాన్ని కమ్ముకున్నాయి. అంతేకాకుండా ఆకస్మిక వరదలు సంభవించాయి. ఇంకోవైపు భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ఇప్పటి వరకు 63 మంది చనిపోగా.. పదుల కొద్దీ గల్లంతయ్యారు. మరోవైపు అధికారులు సహాయ చర్యలు చేపట్టారు. ఇక జూలై 7 వరకు అన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. రూ.400 కోట్ల విలువైన ఆస్తి నష్టం జరిగిందని ప్రభుత్వం తెలిపింది. మండి జిల్లాలో సహాయ, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. రుతుపవనాలు జూన్ 20న హిమాచల్ ప్రదేశ్‌లోకి ప్రవేశించాయి. ప్రతి సంవత్సరం మాదిరిగానే రాష్ట్రవ్యాప్తంగా విధ్వంసం సృష్టించాయి. తాజా సమాచారం ప్రకారం మండి జిల్లాలో 40 మంది మరణించగా, కాంగ్రాలో 13 మంది, చంబాలో ఆరుగురు, సిమ్లాలో ఐదుగురు మరణించినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇక వందలాది ఇళు ్ల ధ్వంసమయ్యాయి. 14 వంతెనలు కొట్టుకుపోయాయి. 300 పశువులు చనిపోయాయి. ఇక విద్యుత్ సబ్‌స్టేషన్లు దెబ్బతినడంతో వేలాది మంది ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. నీరు, ఆహారం కొరత కూడా ఏర్పడింది.

## సవాల్‌గా స్థానిక ఎన్నికలు

హైదరాబాద్,నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు రాకతో తెలంగాణ బీజేపీలో నయా జోష్ కనిపిస్తోందా? రాష్ట్రంలో బీజేపీని ప్రత్యామ్నాయ శక్తిగా కొత్త అధ్యక్షుడు మార్చగలుగుతారా? రామచంద్రరావు కూడా బండి సంజయ్ దూకుడును కొనసాగిస్తారా లేక సౌమ్యుడు కిషన్ రెడ్డి అడుగు జాడల్ని ఫాలో అవుతారా? ప్రస్తుతం రాష్ట్ర బీజేపీ వర్గాల్లో ఇదే చర్చనీయాంశంగా మారింది

**బీజేపీ బలం, బలహీనతలు తెలిసిన రామచంద్రరావు**

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన రామచంద్రరావుకు ఆందోళనలు కొత్తకాదు. స్వతహాగా న్యాయవాది అయిన ఆ వకీల్ సాబ్‌కు పార్టీ బలం, బలహీనతల గురించి బాగా తెలుసు అనే టాక్ పార్టీ నేతల్లో వినిపిస్తుంది. బెంజ్ తెలుసు, గంజి తెలుసు అన్నట్టు పార్టీలో సంస్థాగత రాజకీయాలు, తెలంగాణ రాజకీయాలను రామచందర్‌రావు బాగా ఒంటబట్టించుకున్నారనేది పార్టీ నేతల మాట. తనపై వస్తున్న విమర్శలపై అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాతే గట్టిగానే సమాధానం ఇచ్చారు రామచంద్రరావు. గుండీలు చించుకొని మాట్లాడితే లీడర్ కాదు, సిద్ధాంతం ఒంట పట్టించుకున్నోడే నాయకుడు అంటున్న రామచంద్రరావు మాటలు బీజేపీలో హైప్ తెస్తోందంట

**ఆసక్తి రేపుతున్న రామచంద్రరావు వ్యవహారతీరు**

బండి సంజయ్ లాంటి దూకుడు స్వభావం కిషన్ రెడ్డి లాంటి కామ్ అండ్ కూల్ నేచర్ ఉన్న అధ్యక్షులను తెలంగాణ బీజేపీ నేతలు చూశారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్‌రావు ఎలా వ్యవహరించబోతున్నారనేది ఇప్పుడు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. బండి సంజయ్ ఎగ్రెసివ్ ధోరణిలో బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. తన హయంలో బీఆర్ఎస్ విధానాలను బలంగా ఎండగొట్టారు. ఆ తర్వాత బీజేపీ పగ్గాలను కిషన్ రెడ్డి చేపట్టారు. కిషన్ రెడ్డికి స్వతహాగా సౌమ్యుడన్న పేరుంది. బండి సంజయ్ లాగా ఎగ్రెసివ్ గా కాకుండా కిషన్ రెడ్డి ప్రణాళికాబద్ధంగా పార్టీ వ్యవహారాలను నడిపించారని పార్టీ నేతలు అంటుంటారు. ఇప్పుడు రామచంద్రరావు ఎలా పార్టీని ముందుకు తీసుకువెళ్లబోతున్నారనేది పార్టీలో హాట్ డిబెట్ అయిందట.

**గతంలో ఎమ్మెల్సీగా పనిచేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు**

స్వతహాగా న్యాయవాది అయిన రామచందర్‌రావు ఎమ్మెల్సీగా పని చేసిన అనుభవం ఉంది. పార్టీలో క్రియాశీలంగా పనిచేసిన అనుభవం ఉండడం రామచందర్‌రావుకు కలిసొచ్చే అంశంగా పార్టీ నేతలు చెబుతున్నారు. పార్టీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై ఆయనకు పూర్తి అవగాహన ఉంది. సుదీర్ఘకాలంగా పార్టీలో యాక్టీవ్ రోల్ పోషించిన నాయకుడిగా నేతల పనితీరు, అంతర్గత అంశాలను ఎలా డీల్ చేయాలన్నది ఆయనకు తెలియంది కాదు. పూర్తి స్థాయిలో పార్టీ కోసం పనిచేసే నిబద్ధత నూతన అధ్యక్షుడిగా రామచంద్రరావుకు కలిసొచ్చే అంశంగా చెప్తున్నారు.

**రాజకీయంగా, పార్టీలోని పరిణామాలతో సవాళ్లు**

అయితే అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిని రామచంద్రరావుకు అటు రాజకీయంగా, ఇటు పార్టీలోని పరిణామాలతో సవాళ్లు ఎదురుకానున్నాయి. రాబోయేది ఎన్నికల కాలం. 2023 అసెంబ్లీ ఎన్నికలలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది.

## పర్యావరణానికి, ప్రజలకు మేలు కలిగేలా మైనింగ్




హైదరాబాద్,సింగరేణి సంస్థ తన బొగ్గు తవ్వకాలను పర్యావరణానికి నష్టం కలగకుండా, సమీప ప్రజలకు ప్రయోజనకరంగా ఉండే విధంగా నిర్వహిస్తోందని, సంస్థ అభివృద్ధితో పాటు స్థానిక ప్రజల, సమీప ప్రాంతాల అభివృద్ధికి కూడా పెద్దపీట వేస్తోందని సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్. బలరామ్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ లో వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ వారి ఆధ్వర్యంలో ఉత్తమ మైన్ క్లోజర్ పద్ధతుల ద్వారా పర్యావరణహిత, బాధ్యతాయుత మైనింగ్ అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన సింగరేణి తరపున పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ అవలంబిస్తున్న విధానాలను వివరించారు. సింగరేణి సంస్థ పర్యావరణకు హాని కల్పించని సర్ఫేస్ మైనర్, ఇన్ పిట్ క్రషర్, డ్రాగ్ లైన్, కంటిన్యూయస్ మైనర్, లాంగ్ వాల్ వంటి మైనింగ్ టెక్నాలజీలని వినియోగిస్తుందని, నిబంధనల ప్రకారం మొక్కలు నాటుతూ వనాలుగా పెంచుతోందన్నారు ఇప్పటికే 7 కోట్ల 76 లక్షల మొక్కలను నాటడం జరిగింది అన్నారు. బొగ్గు గనుల ప్రారంభం నుండి మూసివేత వరకు, ఆ తదుపరి కూడా మైన్ క్లోజర్ ప్లాన్ లను నిబంధనల ప్రకారం తు.చ తప్పకుండా అమలు జరుపుతున్నామని, యథాస్థితి పర్యావరణ పరిస్థితులకు, సమీప గ్రామాల అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక చొరవ చూపిస్తుందన్నారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ నుంచి వచ్చే సుమారు 1,205 లక్షల కిలో లీటర్ల నీటిలో కంపెనీ అవసరాలు పోగా మిగిలిన 820 లక్షల కిలో లీటర్ల నీటిని స్థానిక ప్రజల అవసరాల కోసం వినియోగించడం జరుగుతుందని, వీటిలో 465 లక్షల కిలో లీటర్ల నీటిని సమీపంలోని చెరువులు, కుంటలలోకి పంపించడం జరుగుతుందని మిగిలిన 330 లక్షల కిలో లీటర్ల నీటితో స్థానికులు తమ పంట పొలాలను సాగు చేస్తున్నారని తెలిపారు. మొత్తం మీద సింగరేణి సంస్థ అందించే నీటితో 13,625 ఎకరాలలో సేద్యం జరుగుతుందన్నారు. అలాగే భూగర్భ జలాల పెంపుదల కోసం నీటి బిందువు-జల సింధువు అనే కార్యక్రమాన్ని చేపట్టి 62 కొత్త చెరువులను నిర్మించడం జరిగిందని, 45 పాత చెరువుల్లో పూడిక తొలగింపు చేపట్టామన్నారు. పాత గనులకు సంబంధించిన భవనాలలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కోసం స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ లను ప్రారంభించడం జరిగిందన్నారు. మూసివేసిన ఓపెన్ కాస్ట్ గనుల నీటి సంపులలో నీటి నిల్వను కొనసాగించడం ద్వారా సమీప ప్రాంతాలలో భూగర్భ జలాల పెంపుదల సాధ్యమైందన్నారు. సమీప గ్రామాల నిరుద్యోగ యువతకు, మహిళలకు అనేక రకాల ఉపాధి అవకాశ శిక్షణలు ఉచితంగా అందించడం జరుగుతుందని, అలాగే ప్రతీ నెల సమీప గ్రామాల్లో ఉచిత మొబైల్ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. సింగరేణిలోని ఖాళీ ప్రదేశాల్లో ఇప్పటికే 245.5 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని, రెండవ దశ ప్లాంట్లు పూర్తయిన తర్వాత సింగరేణి సంస్థ నెట్ జీరో కార్బన్ ఎమిషన్ కంపెనీగా గుర్తింపు పొందనున్నదని పేర్కొన్నారు. ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ డంప్ ల మీద కూడా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గనులకు సమీపంలోని గ్రామాలలో వ్యవసాయ అభివృద్ధి కోసం 20 వ్యవసాయ చెరువుల్లో పూడిక తొలగించడం జరిగిందని, సింగరేణి చేపట్టే భారీ ప్లాంటేషన్ పనులు, ఇతర ఔట్ సోర్సింగ్ పనుల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. మొత్తం మీద సింగరేణి సంస్థ పర్యావరణానికి కట్టుబడి, స్థానిక ప్రజల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని అనేక కార్యక్రమాలను చేపట్టిందని వీటిని ఇకపై కూడా కొనసాగించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియాలోని డోర్లి- 1 ఓపెన్ కాస్ట్ మూసివేసిన తర్వాత చేపట్టిన పర్యావరణ చర్యలపై ఒక లఘు డాక్యుమెంటరీ చిత్రాన్ని కూడా ప్రదర్శించారు. సింగరేణితో పాటు కోల్ ఇండియా నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ వారు, టాటా స్టీల్ కంపెనీ, వేదాంత, హిందాల్కో, ఎన్ఎండిసి వంటి ఇతర సంస్థలు, కొన్ని విదేశీ సంస్థలు తాము చేపడుతున్న మైన్ క్లోజర్ ప్లాన్ లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సదస్సులో ఛైర్మన్ తో పాటు సింగరేణి తరపున డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి. సత్యనారాయణ రావు, డైరెక్టర్ ( ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ ) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీకి అర్థం కాని తెలుగు రాజకీయం !

హైదరాబాద్,"ప్రస్తుత రాజకీయాల్లో మోదీ, షాలను మించిన వ్యూహకర్త లేరు. వారు దృష్టి పెడితే ఎలాంటి చోట అయినా బీజేపీ జెండా ఎగరాల్సిందే" .. అని అందరూ అనుకుంటారు. ఇప్పటి వరకూ చేసి చూపించారు కూడా. భావజాలం ప్రకారం బీజేపీకి అసలు చోటే ఉండని బెంగాల్ లాంటి రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీల్ని సైతం నిర్వీర్యం చేసి..ప్రధాన పార్టీగా ఎదిగింది. అధికారానికి అడుగు దూరంలోనే ఉంది చాన్సే లేని చోట బీజేపీని నిటారుగా నిలబెట్టిన ఆ రాజకీయ దురంధరలకు తెలుగు రాష్ట్రాల రాజకీయం మాత్రం అర్థం కావడం లేదు. ముఖ్యంగా తెలంగాణ రాజకీయాలు అర్థం కావడం లేదు. ఇక్కడి నుంచి వస్తున్న తప్పుడు సమాచారంతో వారు నిర్ణయాలు తీసుకుంటున్నారా ? లేకపోతే అసలు తెలుగు రాజకీయాలనే అర్థం చేసుకోలేకపోతున్నారా ? అన్నది ఎవరికీ అంతు చిక్కడం లేదు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్.రాంచంద్రరావును ప్రకటించడంతో అందరూ ఉసూరుమన్నారు. ఒకరు చంద్రబాబు చెబితే అధ్యక్షుడిగా నియమించారని అంటారు. మరొకరు కేసీఆర్ తో పొత్తుల కోసం బీజేపీ హైకమాండ్ రాంచంద్రరావును నియమించిందని తేల్చారు. అంతే కానీ ఒక్కరంటే ఒక్కరు కూడా రామచంద్రారవు బీజేపీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు.. ఆ పార్టీని బలోపేతం చేసేందుకు హైకమాండ్ ఎంతో ఆలోచించి చేసిన నియా మకం అని అనుకోలేదు. ఈ నిర్ణయంపై ఎలాంటి ప్రచారం జరుగుతుందో బండి సంజయ్ లాంటి వారికి బాగా తెలుసు. అందుకే బండి సంజయ్ పదే పదే ఎవరైనా సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేయాల్సి వచ్చింది. ఈ విషయం హైకమాండ్‌కు తెలియదా ?

**పార్టీ బలోపేతం అయింది బండి సంజయ్ నాయకత్వంలో**

రాష్ట్ర విభజన వరకూ భారతీయ జనతా పార్టీ తెలంగాణలో చాలా అంటే చాలా మైనర్ పార్టీ. సొంతంగా కిషన్ రెడ్డి ఒక్కరే గెలవగల కెపాసిటీతో ఉండేవారు. 2014లో టీడీపీతో పొత్తులు పెట్టుకోవడం ద్వారా ఐదు ఎమ్మెల్యే సీట్లు దక్కించుకున్నారు. తర్వాత కూడా ఆ పార్టీ పరిస్థితి మెరుగుపడలేదు. 2018 ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో కిషన్ రెడ్డి కూడా ఓడిపోయారు. కానీ గోషామహల్‌లో రాజాసింగ్ గెలిచి పరువు నిలబెట్టారు. అక్కడ బీజేపీ ఫ్యాక్టర్ కన్నా.. ఆయన హిందుత్వ రాజకీయాలే గెలిపించాయి. అయినా సరే బీజేపీ పరువు నిలబడింది. అప్పటికి బీజేపీ ప్రభావం శూన్యం.. ఎవరికి పగ్గాలు ఇస్తే ఎలా బలోపేతం చేస్తారో తెలియని పరిస్థితి. కానీ 2020 బండి సంజయ్‌కు పగ్గాలు ఇవ్వడంతో బీజేపీ రాత మారిపోయింది. అప్పటికి కరీంనగర్‌కు మాత్రమే పరిమితమైన నేత బండి సంజయ్. కానీ తన బలం ఏమిటో తనకు బాగా తెలుసు. తన బలాన్ని పార్టీ అభివృద్ధికి ఎలా ఉపయోగించాలో బాగా తెలుసు. 2023 జూలై వరకూ ఆయన అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ మధ్య కాలంలో బీజేపీ గ్రాఫ్ ఎంత పెరిగిందంటే.. ఆయనను పదవి నుంచి తప్పించే వరకూ బీజేపీనే బీఆర్ఎస్‌కు ప్రత్యర్థి అనుకున్నారు. తనకు ఇచ్చిన మూడేళ్ల స్వల్పకాలంలోనే బండి సంజయ్ పార్టీని బలోపేతం చేశారు. పాదయాత్ర చేశారు. బీఆర్ఎస్‌తో ఢీ అంటే ఢీ అన్నారు. పార్టీ కార్యకర్తలు కోరుకున్నంత జోష్ వచ్చింది. ఆయన వివాదాస్పద ప్రకటనలు చేసి ఉండవచ్చు కానీ.. బీజేపీకి అలాంటివి ఉపయోగపడ్డాయి. బలోపేతం అయ్యాయి. ఆయన ప్రకటనలు బీజేపీకి ఒక్క ఓటు కూడా నష్టం చేసే అవకాశం లేదు. పైగా బీసీ వర్గం నుంచి బలంగా ఎదుగుతున్న నేతగా గుర్తింపు పొందారు. ఆయననే తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా కొనసాగి ఉంటే. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారానికి వచ్చేదో లేదో కానీ.. ఉత్తర తెలంగాణలో మాత్రమే సీట్లు సాధించే స్థితికి మాత్రం దిగజారి ఉండదని రాజకీయాలపై అవగాహన ఉండే అందరికీ తెలుసు.

**బండి సంజయ్‌ను మార్చడమే పెద్ద సెల్ఫ్ గోల్**

"మా నోటి కాడ కూడును లాక్కున్నారని" కాంగ్రెస్ పార్టీపై అప్పుడప్పుడూ బండి సంజయ్ విమర్శిస్తూంటారు. అందులో వాస్తవం ఉంది. 2023లో జూలైలో బీజేపీ హైకమాండ్ ఏం ఆలోచించి.. ఆయనను అధ్యక్ష పదవి నుంచి తప్పించి మళ్లీ కిషన్ రెడ్డికి అప్పగించిందో కానీ.. బీజేపీ గ్రాఫ్ ఒక్క సారిగా పడిపోయింది. ఎంతగా అంటే.. ఇక ఆ పార్టీ రేసులో లేదు.. కాంగ్రెస్ పార్టీదే గెలుపన్నట్లుగా ప్రచారం జరిగింది. అదే సమయంలో ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితను అరెస్టు చేస్తారని అనుకున్నారు. అక్కడా ఎలాంటి నిర్ణయం జరగలేదు. దాంతో మొత్తం కాంగ్రెస్ కు అనుకూలంగా మారిపోయింది. బీజేపీనే బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయం అని ఆ పార్టీ గెలుపు తథ్యమని బీజేపీలో చేరిన రాజగోపాల్ రెడ్డి లాంటి వాళ్లు మళ్లీ ఇక బీజేపీతో లాభం లేదని కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు.



బండి సంజయ్ మూడేళ్ల పాటు కష్టాలు పడి పార్టీకి తీసుకొచ్చిన గ్రాఫ్ దాంతో పడిపోయింది. లక్కీగా ఉత్తర తెలంగాణలో భారత రాష్ట్ర సమితి ఓటు బ్యాంక్‌ను కైవసం చేసుకుంటున్న సంకేతాలను మాత్రం అందుకుంది. తర్వాత ఆరు నెలల్లోనే వచ్చిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటింది. బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ అత్యధికంగా బీజేపీకి బదిలీ అయింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ 35.1 శాతం ఓటు షేర్ సాధించింది. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కన్నా డబుల్. BJP 8 లోక్ సభ సీట్లు గెలుచుకుంది. భారత రాష్ట్ర సమితి 16.7 శాతం ఓటు షేర్ మాత్రమే సాధించింది. బీజేపీ గెలిచిన అన్ని చోట్లా బీఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోయింది. అంటే క్రమంగా బీఆర్ఎస్ ఓటర్లు బీజేపీ దగ్గరకు చేరుతున్నారని సులువుగా అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి సమయంలో ఏ రాజకీయ పార్టీ అయినా ఏం చేస్తుంది?. బీఆర్ఎస్ పార్టీని మరింతగా టార్గెట్ చేసుకుని ఆ పార్టీని నిర్వీర్యం చేసి.. ఆ పార్టీ ఓటు బ్యాంక్ ను కైవసం చేసుకుని ప్రధాన పార్టీగా తమ స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలనుకుంటారు. కాంగ్రెస్ పార్టీ తర్వాత తమదే అధికారం అని అనుకుంటారు.

**ఉద్దేశపూర్వకంగా బీజేపీ ఎదుగుదల నియంత్రణ**

కానీ భారతీయ జనతా పార్టీ హైకమాండ్ ఏం చేసింది ?. పార్టీ వ్యవహారాలపై చాలా కాలం స్తబ్దుగా ఉంది. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో చేసిన ఎన్నో పొరపాట్లపై కనీస పోరాటం చేయలేదు. పార్టీ నేతలంతా అంతర్గత రాజకీయాల్లో కొట్టుమిట్టాడుతుంటే అలా వదిలేశారు. చివరికి ఆరు నెలలు సాధన చేసి మూలనున్న ముసలమ్మను కొట్టిన చందంగా%ౌ% గత ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా ఆసక్తి చూపని రామచంద్రరావుకు పదవి ఇచ్చి పీఠంపై కూర్చోబెట్టారు. ఆయన కంటే బలమైన నేతలు లేరా అంటే.. చాలా మంది ఉన్నారు. పక్క పార్టీ నుంచి వచ్చిన ఈటల రాజేందర్ ఉన్నారు. ఆయన చాలా ఆశలు పెట్టుకున్నారు. కానీ చాన్స్ ఇవ్వలేదు. ఆయన కాకపోతే బీఆర్ఎస్ పొడే గిట్టని .. అవకాశం కల్పించుకుని మరీ బీఆర్ఎస్ పార్టీని నిర్వీర్యం చేసే లక్ష్యంతో ఉండే ఎంపీ ధర్మపురి అర్వింద్.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా రెడీగా ఉన్నారు. తనకు కేంద్ర మంత్రి పదవి అవసరం లేదని.. రాష్ట్ర రాజకీయాల్లో ఉంటానని బీజేపీని అధికారంలోకి తీసుకు రావడమే తన లక్ష్యమని బండి సంజయ్ చెబుతున్నా%ౌ% మోదీ, షాలకు ఎక్కలేదు. బండి సంజయ్ తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షునిగా ఉన్నప్పుడు పలుమార్లు ఆయన నాయకత్వాన్ని మోదీ ప్రశంసించారు. గ్రేటర్ ఎన్నికల ఫలితాల తర్వాత ఆశ్చర్యకర ఫలితాలను చూసి మోదీ స్వయంగా బండి సంజయ్ కు ఫోన్ చేసి మాట్లాడారు. మరి ఈ పొటెన్షియల్ ఉన్న లీడర్లను ఎందుకు వద్దనుకున్నారు?. రామచంద్రరావులో ఎం చూశారు?. మరో పార్టీ బలాన్ని ఉపయోగించుకుని అధికారంలోకి రావాలని బీజేపీ పెద్దలు అనుకుంటారని .. అనుకోలేం. ఎందుకంటే సొంతంగా తెలంగాణలో అధికారాన్ని చేపట్టడం కన్నా.. సంతోషం ఆ పార్టీ పెద్దలకు ఏముంటుంది ?. ఎందుకో కానీ.. బీజేపీ సొంతంగా అధికారంలోకి రాదని అనుకుంటున్నారని ఈ ఎంపికలను బట్టి చూస్తే ఎవరికైనా అనిపిస్తుంది. నిర్వీర్యం అయిపోతున్న బీఆర్ఎస్ కు కాస్త బలం తెచ్చేలా చేసి ఆ పార్టీతో కలిసి పోటీ చేయాలని అనుకుంటున్న సూచనలు కనిపిస్తున్నాయని అంటున్నారు. లేకపోతే ఆ పార్టీని పూర్తి స్థాయిలో విలీనం చేసుకునే ప్రక్రియ కోసం రామచంద్రరావును ఎంపిక చేసి ఉండవచ్చని అనుకుంటున్నారు. నిజానికి ఈ విలీన రాజకీయం చాలా రిస్క్. రాజకీయాల్లో ఎప్పుడైనా అధికారాలు రెండు పార్టీల మధ్య మారుతున్నప్పుడు మూడో పక్షం ప్రత్యామ్నాయంగా వస్తే ప్రజలు ఏకపక్షంగా ఓట్లేసి గెలిపిస్తారు. ఎప్పుడూ వాళ్లేనా అని మూడో ప్రత్యామ్నాయాన్ని చూసుకుంటారు.

## విషం చిమ్ముతున్న దేశద్రోహులు

న్యూఢిల్లీ,ఈ దేశంలో ఉంటూ.. ఈ దేశం తిండి తింటూ.. ఇక్కడ సౌకర్యాలు అనుభవిస్తూ.. పక్క దేశాలకు సపోర్టు చేస్తున్న వారు చాలా మందే ఉన్నారు. సోషల్ మీడియాలో సొంత దేశానికి వ్యతిరేకంగా పోస్టులు సైతం పెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అలాంటి వారికి బుద్ధి చెప్పడానికి సిద్ధమైంది. కేంద్ర హోం శాఖ కొత్త పాలసీ తేబోతోంది. ఈ పాలసీ గనుక అమలైతే దేశానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టే వారికి చుక్కలు కనిపించనున్నాయి. ఈ పాలసీలో భాగంగా దేశానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పెట్టే వీడియో, ఇతర కంటెంట్‌ను గుర్తించనున్నారు. వాటిని బ్లాక్ చేయనున్నారు. ఆ కంటెంట్ పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. దేశానికి వ్యతిరేకంగా కంటెంట్ ఉండే వెబ్ సైట్లపై కూడా చర్యలు ఉండనున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఇంటెలిజెన్స్ ఏజెన్సీలోని అత్యున్నతాధికారులు యాంటీ నేషనల్ పోస్టుల గురించి హోమ్ మినిస్ట్రీకి చెప్పారట. ఈ నేపథ్యంలోనే కేంద్ర కొత్త పాలసీ తేవాలని చూస్తోందని తెలుస్తోంది. దేశానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారిని, వ్యతిరేకంగా పని చేసే వారిని గుర్తించడానికి కేంద్రం ఓ టీమ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ టీమ్ దేశ వ్యతిరేక కార్యాకలాపాలపై దృష్టి పెడుతుంది. ఖలిస్తానీ టెర్రరిస్ట్ గురుపత్వంత్ సింగ్ పన్నులాంటి వారి ఖాతాలు కూడా ఇండియాలో బ్యాన్ అవ్వనున్నాయి. ఈ కొత్త పాలసీ కోసం సోషల్ మీడియా కంపెనీలతో పాటు అమెరికా ప్రభుత్వంతో కేంద్రం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

## రోడ్డు దాటుతుండగా దూసుకొచ్చిన బస్సు

విజయవాడ,కృష్ణా జిల్లాలోని జగ్గయ్యపేటలో స్కూల్ విద్యార్థులకు భారీ ప్రమాదం తప్పింది. ప్రతీ రోజులాగే ఈరోజు కూడా విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు బస్సు ఎక్కారు. స్కూల్ వద్దకు వాహనం చేరుకున్న వెంటనే వారంతా ఒకరి తరువాత ఒకరు దిగి లోపలికి వెళ్తున్నారు. ఇదే సమయంలో జరిగిన ఓ ఘటన అక్కడి వారిని భయాందోళనకు గురిచేసింది. అయితే వాహనం డ్రైవర్, క్లీనర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పిల్లలకు పెను ప్రమాదం తప్పినట్లైంది. చిన్నారులంతా క్షేమంగా ఉండటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. శుక్రవారం ఉదయం కేసీపీ క్వార్టర్స్ నుంచి విద్యార్థులను పాఠశాలల్లో దింపేందుకు కంపెనీ వాహనం క్వార్టర్స్ వద్దకు వెళ్లింది. పిల్లలు అందరూ ఎక్కిన తర్వాత బస్సు బయలుదేరింది. ఆ తరువాత బజాజ్ షోరూం సమీపంలో వాహనాన్ని ఆపి స్కూల్లోకి పిల్లలను పంపించేందుకు బస్సు నుంచి డ్రైవర్, క్లీనర్ కిందకు దిగారు. అయితే వారు రోడ్డు క్రాస్ చేసి వస్తున్న సమయంలో కోదాడ రోడ్డు వైపు నుంచి ఓ ప్రైవేటు స్కూల్ బస్సు అతివేగంగా దూసుకొచ్చింది. తన బస్సుకు బ్రేక్ ఫెయిల్ అయ్యిందంటూ డ్రైవర్ గట్టి గట్టిగా అరిచాడు. పిల్లల మీదకు రాబోతున్న బస్సును వెంటనే గమనించిన డ్రైవర్, క్లీనర్ సమయస్ఫూర్తితో చిన్నారులను అక్కడి నుంచి తప్పించేశారు. దీంతో పిల్లలంతా క్షేమంగా బయటపడ్డారు. డ్రైవరు, క్లీనర్ గమనించకపోతే బస్సు దూసుకొచ్చి పిల్లలపైకి వెళ్లలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో 15 నుంచి 20 మంది పిల్లలు రోడ్డు దాటుతున్నారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్‌ను ఎస్సై రాజు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అబద్ధాల ప్రచారంలో మోడీ సిద్ధహస్తుడు

హైదరాబాద్,తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్లే.. కేంద్రంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరుతుందని ఏఐసీసీ అధ్యక్షులు, ఎంపీ మల్లికార్జున్ ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు. దేశరక్షణ కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆయన పురుద్ఘాటించారు. విదేశాలు తిరుగుతున్న మోడీ, మణిపూర్‌కు మాత్రం ఇప్పటి వరకు వెళ్లలేదని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్ధాలేనన్నారు. దేశానికి ప్రధాని మోదీ, కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా చాలా చాలా చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కానీ వాళ్లు ఈ దేశానికి, తెలంగాణకు చేసిందేమిటని సూటిగా ప్రశ్నించారు. నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. ఇప్పటి వరకు ప్రధాని మోదీ 42 దేశాలు తిరిగారని గుర్తు చేశారు. కానీ ప్రజలు చనిపోతున్నా.. మణిపూర్ మాత్రం ఆయన వెళ్లలేదని మండిపడ్డారు. పాకిస్థాన్‌ను ఏదేదో చేస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించార న్నారు. కానీ ఎందుకు ఏం చేయలేదని మోదీ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. పాకిస్తాన్‌పై యుద్ధం చేయకుండా.. మిమ్మల్ని ఎవరు ఆపారంటూ సందేహం వ్యక్తం చేశారు. పహల్గాం ఘటన తరవాత ఆపరేషన్ సింధూర్‌కు కాంగ్రెస్ మద్దతు ప్రకటించిందని గుర్తు చేశారు. దేశ ఆర్థిక పరిస్థితిని ప్రధాని మోదీ చిన్నాభిన్నం చేశారు. పాకిస్థాన్‌తో యుద్ధం చేయాలని 'ఆపరేషన్ సిందూర్'కు రాహుల్‌గాంధీతో పాటు కాంగ్రెస్ కూడా సంపూర్ణ మద్దతు ఇచ్చింది. మరి మోదీ ఎందుకు యుద్ధాన్ని మధ్యలోనే ఆపేశారు? అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేయగానే యుద్ధం ఆపేశారు.. కానీ ఆ విషయంపై ప్రధాని నోరు విప్పరు. మణిపూర్ ఈ దేశంలో భాగం కాదా? మణిపూర్ వాసులు భారతీయులు కాదా?అఖిలపక్ష సమావేశానికి ప్రధాని రాలేదు.. బిహార్ ఎన్నికల ప్రచారంలో ఆయన బిజీగా ఉన్నారు' అని ఖర్గే విమర్శించారు. ప్రధాని మోదీలాగా ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు భయపడ లేదన్నారు. ఎవరు వచ్చినా బంగ్లాదేశ్‌కు స్వాతంత్య్రం కల్పిస్తామని ఇందిరాగాంధీ ప్రకటించారని.. అదే పని ఆమె చేసి చూపించారన్నారు. క్షమాపణలు చెప్పడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పని అంటూ అయన ఎద్దేవా చేశారు. రాజ్యాంగం నుంచి లౌకిక అనే పదాన్ని తీసి వేయాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. సెక్యులర్ అనే పదం రాజ్యాంగంలోనే లేదని బీజేపీ చెపుతుందన్నారు. ఃాజ్యాంగం నుండి లౌకిక పదాన్ని తీసేయారని తాను చాలెంజ్ చేస్తున్నానని ఈ సందర్భంగా ఖర్గే ప్రకటించారు. సెక్యులర్ అనే పదం బీజేపీ ప్రణాళికలో రాసుకున్నారని వివరించారు. సెక్యులర్ అనే పదంతో మీకు ఇబ్బంది ఉంటే మీ పార్టీ ప్రణాళిక నుంచి తీసివేయాలని బీజేపీ అగ్రనేతలకు ఖర్గే బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందంటే.. అది కార్యకర్తల కృషి ఫలితమేనని స్పష్టం చేశారు. రేవంత్, భట్టి, మంత్రులు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేశారన్ని వివరించారు. కేసీఆర్, బీజేపీ కలిసి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అడ్డుకుంటున్నారన్నారు. కానీ తెలంగాణ ప్రజలు మాత్రం ఈ రెండు పార్టీలను ఓడించారని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని గతంలో తాను చెప్పానని వివరించారు. కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణలో 50కిపైగా కేంద్ర సంస్థలు వచ్చాయని గుర్తు చేశారు. తెలంగాణకు ఈ 11 ఏళ్లలో ఏం ఇచ్చారంటూ ప్రధాని మోదీని ఈ సందర్భంగా ఖర్గే సూటిగా ప్రశ్నించారు. గతంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులను కేసీఆర్ మోసం చేశారు.

# ప్రధాన నిందితుడి గురించి వెలుగులోకి సంచలన విషయాలు..



కోల్ కతా :సౌత్ కలకత్తా లా కాలేజీ గ్యాంగ్ రేప్ కేసులో దర్యాప్తు సాగుతున్న కొద్దీ ప్రధాన నిందితుడు మోనోజిత్ మిశ్రా గురించి సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.మోనోజిత్ ప్రవర్తనకు సంబంధించి లా కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ దేబాషిష్ చటోపాధ్యాయ 2018లో కోల్‌కతా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు పంపిన లేఖను తాజాగా జాతీయ మీడియా సంస్థ "ఆజ్ తక్" స్వాధీనం చేసుకుంది. పోలీసులకు రాసిన ఈ లేఖలో వివిధ క్యాంపస్ కార్యక్రమాల సమయంలో మోనోజిత్ మిశ్రా ప్రవర్తన గురించి అప్పటి ప్రిన్సిపాల్ ఆందోళన వ్యక్తం చేశారు.కళాశాలలో జరిగే ప్రతి కార్యక్రమంలో మోనోజిత్ మిశ్రా విఘాతం కలిగించేవాడు. డిసెంబర్ 13, 2018న జరగాల్సిన కళాశాల వార్షిక సామాజిక కార్యక్రమంలో అవాంతరాలు సృష్టిస్తాడని ప్రిన్సిపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి తగిన భద్రత కల్పించాలని ప్రిన్సిపాల్ చటోపాధ్యాయ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ప్రధాన కార్యాలయం)కి లేఖ రాశారు. అప్పటి నుంచే నిందితుడు కళాశాలలో వివాదాస్పద వ్యక్తిగా ఉండేవాడు.కాగా దక్షిణ కలకత్తా లా కాలేజీ గ్యాంగ్ రేప్ కేసులో రాష్ట్రం తరపున వాదించడానికి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సీనియర్ న్యాయవాది బివాస్ ఛటర్జీని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది. చట్టపరంగా, సామాజికంగా సున్నితమైన ఈ కేసు విచారణను ఛటర్జీ పర్యవేక్షిస్తున్నారు. కేసు యొక్క సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకుని, నిందితులను గత నెల 30వ తేదీన వర్చువల్‌గా కోర్టులో హాజరుపరిచారు. ముగ్గురు ప్రధాన నిందితులైన మోనోజిత్ మిశ్రా, జైబ్ అహ్మద్, ప్రమిత్ ముఖర్జీలను కోర్టు జూలై 8 వరకు పోలీసు కస్టడీకి పంపగా, అరెస్టు చేసిన సెక్యూరిటీ గార్డు పినాకి బెనర్జీ కస్టడీని జూలై 4 వరకు పొడిగించింది.

# పాట్నాలో దారుణం.. వ్యాపారవేత్త, బీజేపీ నేత గోపాల్ ఖేమ్కా హత్య



పాట్నా:బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు పాట్నాలో జరిగిన రాజకీయ హత్య తీవ్ర సంచలనంగా మారింది. ఇంటి ముందే వ్యాపారవేత్త, బీజేపీ నేత గోపాల్ ఖేమ్కాను దుండగులు కాల్చి చంపారు.హత్య రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది.గాంధీ మైదాన్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని 'పనాచే' హొటల్ సమీపంలో శుక్రవారం రాత్రి ఖేమ్కా హత్యకు గురయ్యారు. హొటల్ పక్కనే ఉన్న ట్విన్ టవర్ సొసైటీలో నివాసం ఉంటున్నారు. ఇంట్లోకి వెళ్తుండగా అగంతకులు హఠత్తుగా ప్రవేశించి తుపాకీతో కాల్పులు జరిపారు. అక్కడికక్కడే ఖేమ్కా ప్రాణాలు వదిలారు.ఇక సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని హత్యాస్థలిని పరిశీలించారు. ఒక బుల్లెట్, షేల్ కేసింగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. జూలై 4 రాత్రి 11 గంటల ప్రాంతంలో వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కాను కాల్చి చంపినట్లు గాంధీ మైదాన్ సౌత్ ప్రాంతం నుంచి తమకు సమాచారం అందిందని సిటీ ఎస్పీ దీక్ష తెలిపారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఆసుపత్రి మరియు నేరస్థలానికి చేరుకున్నట్లు వెల్లడించారు. నేరస్థలాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.ఖేమ్కా వృత్తిరీత్యా వ్యాపారవేత్త. ఆయన కుమారుడు గుంజన్ ఖేమ్కా మూడేళ్ల క్రితం హత్యకు గురయ్యాడు. మూడేళ్ల తర్వాత తండ్రి కూడా హత్యకు గురి కావడం దిగ్భ్రాంతికరం. ఇక సంఘటనాస్థలిని పూర్ణియ నుంచి స్వతంత్ర ఎంపీగా గెలిచిన పప్పు యాదవ్ పరిశీలించారు. అనంతరం ఎక్స్‌లో నితీష్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని విమర్శించారు. "బీహార్‌లో ఎవరూ సురక్షితంగా లేరు. బీహార్ నేరస్థులకు స్వర్గధామంగా మారింది! నితీష్ జీ, దయచేసి బీహార్‌ను విడిచిపెట్టండి." అని ఆయన అన్నారు. ఖేమ్కా కుమారుడు హత్యకు గురైనప్పుడే ప్రభుత్వం.. నిందితులపై కఠిన చర్యలు తీసుకుని ఉండుంటే గోపాల్ ఖేమ్కా ఈరోజు హత్యకు గురయ్యేవాడు కాదని పప్పు యాదవ్ అన్నారు.

# ఆ పార్టీలో చేరబోతున్నాని క్లారిటీ ఇచ్చిన రాజాసింగ్..?



హైదరాబాద్, తెలంగాణ బీజేపీలో రెబల్ అవతారమెత్తిన గోషామహల్ రాజాసింగ్ రంగు మార్చనున్నారా? కాషాయ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన ఎరుపు కండువా కప్పుకోనున్నారా? లేకపోతే కమలాన్ని కాదని కాగడా పట్టుకోబోతున్నారా? రాజాసింగ్ శివసేనలోకి జంప్ అవుతారన్న ప్రచారంలో నిజమెంత? ఒకవేళ శివసేనలోకి వెళ్తే రాజాసింగ్ మరో ఏక్‌నాథ్ షిండే అనిపించుకుంటారా? ఏకంగా శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాక్రే అవతారం ఎత్తుతారా? రాజసింగ్ ఫ్యూచర్‌పై పొలిటికల్ సర్కిల్స్‌లో జరుగుతున్న చర్చేంటి?

బీజేపీకి కొరక రాని కొయ్యలా తయారైన రాజాసింగ్

రాజసింగ్ రాష్ట్ర బీజేపీ పరివారులకు కొరక రాని కొయ్యగా తయారయ్యారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్ష రేసులో ఎవరైనా ఉండొచ్చని గట్టిగానే వాదించారు. అందులో భాగంగానే సంస్థగత ఎన్నికల్లో ప్రెసిడెంట్ పోస్టుకి నామినేషన్ వేయడానికి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన గోషామహల్ ఎమ్మెల్యే రాజసింగ్‌కు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మధ్య గొడవ జరిగిందనే టాక్ వినిపిస్తోంది. పార్టీ కార్యాలయానికి వచ్చిన సందర్భంలో కిషన్ రెడ్డి, రాజాసింగ్ ఇద్దరి మధ్య హాట్‌హాట్‌గా మాటల యుద్ధం జరిగిందని పార్టీ నేతలు గుసగుసలాడుకుంటున్నారు.

కొంత కాలంగా కిషన్‌రెడ్డిని టార్గెట్ చేస్తున్న రాజాసింగ్

గత కొంత కాలంగా కిషన్‌రెడ్డిపై విమర్శలు గుప్పిస్తున్న రాజాసింగ్.. తనను నామినేషన్ వేయనీయక పోవడం వల్లే బీజేపీకి రాజీనామా చేశారని పార్టీ వర్గాలు అంటున్నాయి. గతం నుంచి కూడా రాజాసింగ్ కిషన్ రెడ్డిని టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా అధ్యక్ష ఎన్నిక సందర్భంగా ఇద్దరూ తారస పడటంతో పంచాయతీ రాజీనామా వరకు వచ్చింది.

రాజాసింగ్ బయటకు పంపించే యోచనలో బీజేపీ

ఇక ఆ పంచాయితీ అటుంచితే రాజాసింగ్ రాజీనామా తర్వాత సీన్ అంత మారిపోయింది. రాజాసింగ్‌ను బుజ్జగించాల్సిన నాయకత్వ ఆయన్ని పార్టీ నుంచి పంపించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. రాజాసింగ్ రాజీనామా లెటర్‌ను రాష్ట్ర నాయకత్వం ఢిల్లీ పెద్దలకు పంపించింది. ఆయన రాజీనామా లెటర్‌ను ఆమోదించే విధంగా రాష్ట్ర నాయకత్వం తీర్మానం చేసి అధిష్టానానికి పంపిందనే టాక్ వినిపిస్తోంది. మొత్తం మీద రాజాసింగ్‌ను పార్టీ నుంచి పూర్తి స్థాయిలో తొలిగించాలనే ప్రయత్నాలు జరుగుతున్న నేఫథ్యంలో రాజాసింగ్ ప్లాన్ ఏంటి?రాజాసింగ్ పార్టీ మారబోతున్నారా? ఆయన కాషాయ రంగు మారకపోయినా, గుర్తు మారుస్తారా? అన్నది హాట్ టాపిక్‌గా మారింది.

బాల్ థాక్రే శివసేన తీర్థమా..? షిండే వర్గంలో చేరతారా?

రాజసింగ్ శివసేన తీర్థం పుచ్చుకోబోతున్నారా%ొ%పుచ్చుకుంటే ఏ వర్గంలో చేరడానికి ట్రై చేస్తున్నారు? బాల్ థాక్రే శివసేన తీర్థమా..? లేక షిండే వర్గమా అనేది ఇప్పుడు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో సస్పెన్స్‌గా మారింది. బీజేపీకి గుడ్ బై చెప్పి, రాజీనామా చేసిన అనంతరం రాజసింగ్ శివసేన పార్టీ వైపు చూస్తున్నట్టు ఆయన వర్గాలు, సన్నిహితులు చెప్పుకొస్తున్నారు. కట్టర్ హిందుత్వం బీజేపీలో ఏ మాత్రం లేదని, బీజేపీని నమ్ముకుంటే హిందుత్వానికి ద్రోహం చేసినట్టేనని అందుకే హిందుత్వ అజెండా కలిగిన శివసేన పార్టీనే తనకు సరిపోతుందని రాజసింగ్ భావిస్తున్నట్టు సమాచారం.

శివసేన రాష్ట్ర అధ్యక్షుడిగా రాజకీయం చేసే యోచన

అందులో భాగంగానే బీజేపీని ఢీ కొనడానికి శివసేన పార్టీ తీర్థం పుచ్చుకుని, తెలంగాణ పార్టీ అధ్యక్షుడిగా పార్టీ కార్యకలాపాలు నడపాలనే యోచనలో రాజాసింగ్ ఉన్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. బీజేపీలో హిందుత్వ వాదం లేదంటున్న కరుడు గట్టిన హిందుత్వ వాది రాజాసింగ్ పక్కా వ్యూహంతోనే బీజేపీకి రాజీనామా చేసినట్టు కమలం పార్టీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. అదలా ఉంటే రాజాసింగ్ బీజేపీని వదిలి ఏక్‌నాథ్ షిండే అవుతారా..? లేక బాల్ థాక్రే అవుతారా..? తెలంగాణలో కమలం కాదని బాణం గుర్తు జెండా ఎగరవేస్తారా..? లేక కాగడా పట్టుకుంటారా? శివసేనలోని ఏ వర్గానికి నాయకత్వం వహిస్తారు? ఎవరికి న్యాయం చేస్తారు..? అన్నది హాట్ టాపిక్‌గా మారింది. రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేశారుసరే .. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా..? శాసన సభ్యత్వానికి రాజీనామా చేస్తే వచ్చే గోషామహల్ ఉప ఎన్నికల్లో శివసేన అభ్యర్థిగా పోటీ చేస్తారన్న ప్రచారం జరుగుతోంది.

%ూశ్రీంశీ =ము%: రాజకీయాలకు వల్లభనేని వంశీ బ్రేక్ ?

కాంగ్రెస్ కూటమిలో ఉన్న ఉద్ధవ్ గ్రూప్ శివసేన

ఒకవేళ శాసనసభ్యత్వాన్ని వదులుకోవడానికి ఇష్టపడకపోతే రాబోయే జనరల్ ఎలక్షన్స్‌లో శివసేన నుంచి బరిలోకి దిగడానికి ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటామని రాజాసింగ్ వర్గీయులు అంటున్నారు. ప్రస్తుతం మహారాష్ట్ర పార్టీ శివసేన రెండుగా చీలింది. ఉద్ధవ్ థాక్రే గ్రూప్, షిండే గ్రూప్‌లుగా విడిపోయింది. ఉద్ధవ్ గ్రూప్ శివసేన పార్టీ కాంగ్రెస్ కూటమిలో కొనసాగుతోంది. షిండే శివసేన బీజేపీ అలయన్స్‌లో ఉంది. ఈ రెండు గ్రూపుల్లో రాజాసింగ్ ఎటు వైపు మొగ్గు చూపుతారు అనేది ఆసక్తిగా ఉంది. అయితే రాజీనామా చేశారు కాబట్టి బీజేపీ అధిష్టానాన్ని కాదని షిండే గ్రూప్ రాజాసింగ్‌ను తీసుకుంటుందా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరి చూడాలి గోషామహల్ రాజా ఫ్యూచర్ ఎలా ఉంటుందో?

## బిజెపి నేతశ్రీరాములు ఇంటిముందు రోహింగ్యాల రెక్కీ

హైదరాబాద్,రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు ఇంటి ముందు రోహింగ్యాలు రెక్కీ నిర్వహించారు. అందెల శ్రీరాములు ఇంటి ముందు అనుమానాస్పద తిరుగుతున్న ఆరుగురు వ్యక్తులను బిజెపి కార్యకర్తలు, నేతలు గుర్తించారు. వారు పెట్రోల్ బాటిల్, సుత్తి, కట్టర్, ఐరన్ రాడ్స్, బాక్స్ లో పెట్టు-కుని తిరుగుతున్నారు. గత కొన్ని రోజులుగా రోహింగ్యాలపై బిజెపి నేత అందెల శ్రీరాములు యాదవ్ ఉద్యమం చేస్తున్నారు. అందెల శ్రీరాములకు ప్రాణహాని ఉందని బిజెపి నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి నేతలు పట్టు-కోవడానికి ప్రయత్నించగా వాహనం వదిలి పారిపోయారు. ఐదుగురు వ్యక్తులను గుర్తించి మీర్ పేట పోలీస్ స్టేషన్ కు

# రేవంత్‌రెడ్డిని ఉతికి ఆరేయడానికి రెడీ అవుతున్నాడు...!



హైదరాబాద్,తెలంగాణలో కాంగ్రెసు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గులాబీ పార్టీ అధినేత కేసీఆర్? వైఖరి ఎలా ఉందో చూస్తూనే ఉన్నాం కదా. ఫాంహౌజ్? విడిచి బయటకు రావడంలేదు. అసెంబ్లీకి రావడంలేదు. చాలా అరుదుగా జనం ముందుకు వస్తున్నాడు. రేవంత్? రెడ్డిని తిట్టి వెళ్లిపోతున్నాడు. చివరిసారిగా బీఆర్?ఎస్? రజతోత్సవ సభలో మాట్లాడాడు. కాని ఆయన ప్రసంగంలో గతంలో ఉన్న ఊపు లేదని, ఫైర్? లేదని బీఆర్?ఎస్? పార్టీ నాయకులే అభిప్రాయపడ్డారు. ఆయన కూతురు కవిత తన లేఖ ద్వారా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది.అయితే కేసీఆర్? అజ్ఞాతంలో ఉన్నాడని, మౌనంగా ఉన్నాడని అందరూ అనుకుంటారు. కాని కేసీఆర్? మాట్లాడినా, మౌనంగా ఉన్నా ఏవో వ్యూహాలు పన్నుతూనే ఉంటాడు. ఏవో ఆలోచనలు చేస్తూనే ఉంటాడు. మరో పక్క రేవంత్? రెడ్డి మీద రగిలిపోతూనే ఉంటాడు. ప్రస్తుతం ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రిలో ఉన్నాడు. మరీ తీవ్ర అనారోగ్యం ఏమీ కాదు. కాని డాక్టర్లు కొన్ని రోజులు అబ్జర్వేషన్?లో ఉంచుదామని ఆస్పత్రిలో ఉండాలని చెప్పారు. ఆయన ఆరోగ్యం ఎలా ఉందో కొడుకు కేటీఆర్?అప్?డేట్స్? ఇస్తూనే ఉన్నాడు.సరే%ొ%కొందరు గులాబీ పార్టీ నాయ కులు బాస్?ను పలకరిద్దామని, ఆరోగ్యం గురించి తెలుసుకుందామని ఆస్పత్రికి వెళ్లారు. రేవంత్? రెడ్డి ప్రభుత్వం తీరు మీద, జరుగుతున్న పరిణామాల మీద, సమస్యల మీద నాయకుల నుంచి కేసీఆర్?ఫీడ్? బ్యాక్?తీసుకున్నాడు. వాస్తవానికి కేసీఆర్? ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూనే ఉంటాడు. ఆయన జనంలో కలవకపోయినంత మాత్రాన సన్యాసం తీసుకున్నట్లు కాదు కదా.నాయకులతో డైరెక్టుగా మాట్లాడితే ఇంకా కొన్ని విషయాలు తెలుస్తాయి కదా. నాయకులతో మాట్లాడిన తరువాత కేసీఆర్ ?ఒక నిర్ణయం తీసుకున్నాడు. ఏమిటది? మళ్లీ రేవంత్? రెడ్డిపై నిప్పులు చెరగాలని, కడిగిపారేయాలని, ఉతికి ఆరేయాలని అనుకున్నాడు. అందుకే%ొ%"ఒకటి, రెండు రోజుల్లో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అవుతా. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రెస్‌మీట్ పెడతా" అని బీఆర్ఎస్ నేతలతో చెప్పాడు.తెలంగాణ రైతాంగం సమస్యలు, ఏపీలో బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం జరిగితే రాష్ట్రానికి కలిగే నష్టం సహా అనేక అంశాలను మీడియా ముఖంగా ప్రజలకు వివరిస్తానని చెప్పాడు. మరి మీడియా సమావేశంలో ఆయన ఏం చెబుతాడో, రేవంత్? రెడ్డిని ఏఏ విషయాల్లో దోషిగా నిలబెడతాడో చూడాలి.

# ఉత్కంఠ రేపుతోన్న గులాబీ నేతల సైలెంట్




హైదరాబాద్, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించింది కరీంనగర్ జిల్లానే.. అంతేకాకుండా గులాబీ పార్టీకి ఆజిల్లానే ఊపిరి పోసింది.. అప్పుడు తెలంగాణ ఉద్యమ సమయంతో పాటు.. అధికారంలోకి రావడంలో కరీంనగర్ జిల్లానే అండగా నిలిచింది.. అలాంటి జిల్లాలో బీఆర్ఎస్ నేతలు కొంతకాలంగా పూర్తిగా సైలెంటై పోయారు. కీలక నేతలంతా హైదరాబాద్‌లోనే మకాం వేస్తున్నారు. ఒక్కటి.. రెండు కార్యక్రమాలు చేసి.. చేతులు దులుపుకుని వెళ్లిపోతుండటంతో గులబీ శ్రేణులకు దిశానిర్ధేశం లేకుండా పోయిందంట

బీఆర్ఎస్‌కు కంచుకోటగా నలిచిన కరీంనగర్ జిల్లా

గతంలో.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా గులాబీ పార్టీకి కంచుకోట.. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి 2018 ఎన్నికల వరకు.. అక్కడ ఆ పార్టీ పట్టు నిలుపుకుంటూ వచ్చింది. అన్ని ఎన్నికల్లో 90 శాతానికి పైగా సీట్లు బీఆర్ఎస్ ఖాతాలో పడ్డాయి. 2023 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ గాలిలో%ొ%13 స్థానాలకు గాను 5 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది. మిగతా నియోజకవర్గాల్లో కూడా గట్టి పోటీ ఇచ్చింది. సహజంగా కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత తొలి 6 నెలలు ప్రతిపక్షాలు సైలెంట్‌గా ఉంటాయి.

16 నెలలు గడుస్తున్నా కనపించని బీఆర్ఎస్ దూకుడు

అయితే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడుస్తున్నా.. బీఆర్ఎస్ దూకుడు మాత్రం కనబడటం లేదు. ఇప్పటికీ కరీంనగర్ జిల్లాలో గులాబీ పార్టీ క్యాడర్ బలంగానే ఉంది.. హుజురాబాద్ ఎంఎల్ఏ కౌశిక్ రెడ్డి ఒక్కరే కాస్తా దూకుడుగా వెళ్తున్నారు. మిగితా నేతలంతా.. ఏదైనా పార్టీ పిలుపు ఇచ్చిన కార్యక్రమం ఉన్నప్పుడు మాత్రమే స్పందిస్తున్నారు. కేటీఆర్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు మాత్రం హడావుడి చేస్తున్నారు. మిగితా సమయాల్లో చడీ చప్పుడు చేయడం లేదు.

మాజీ ఎమ్మెల్యేలు మనోహర్ రెడ్డి, పుట్ట మధు, కోరుకంటి చందర్

గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులంతా సైలెంటయ్యారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, మంథని మాజీ ఎంఎల్ఏ పుట్ట మధు, రామగుండం మాజీ ఎంఎల్ఏ కోరుకంటి చందర్, మానకొండూరు మాజీ ఎంఎల్ఏ రసమయి బాలకిషన్, హుస్నాబాద్ మాజీ ఎంఎల్ఏ సతీష్ బాబు తదితర నేతలు పూర్తిగా దూకుడు తగ్గించారు. గెలిచిన ఎంఎల్ఏలు మాత్రం అప్పుడప్పుడు ప్రెస్ మీట్ పెడుతూ ఉన్నామంటే ఉన్నాం అనిపించుకుంటున్నారు.

సైలెంట్ అయిన మాజీ మంత్రి గంగుల కమలాకర్

త్వరలో స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. ఇక్కడ మాత్రం అందుకు తగ్గట్టుగా సమావేశాలు జరగడం లేదు. క్యాడర్ను ఏ మాత్రం సమయత్తం చేయడం లేదు. మెజారిటీ నేతలు అంతా హైదరాబాద్లో ఉంటున్నారు. పార్టీ ఏదైనా కార్యక్రమానికి పిలుపునిస్తే మాత్రం నియోజకవర్గాలకు వచ్చి కార్యక్రమాలు నిర్వహించి వెళ్తున్నారు. ఎప్పుడు దూకుడుగా ఉండే మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కూడా సైలెంట్ అవ్వడం చర్చనీయాంశంగా మారింది.

సమయం చూసి దూకుడు పెంచుతారంట

గతంలో తరచూ పార్టీ సమీక్షా సమావేశాలు నిర్వహించేవారు.. ఇప్పుడు ఆరు నెలల నుంచీ ఒక్క సమావేశం కూడా నిర్వహించ లేదు. ప్రధాన పార్టీ బీఆర్ఎస్ సైలెంట్గా ఉండటంతో.. కాంగ్రెస్‌తో పాటు బిజెపి ఆ జిల్లాలో బలోపేతానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. అయితే తాము సమయం చూసి దూకుడు పెంచుతామని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారంట. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి కాంగ్రెస్‌కి గుణపాఠం చెబుతామని క్యాడర్‌కి భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారంట.అదేమంటే ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వంస్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి ముందుకు రావడం లేదని అంటున్నారంట. మరి గులాబీ నేతలు యాక్టివ్ అయ్యేది ఎప్పుడో కాని అప్పటికి ఆ పార్టీ క్యాడర్ చెల్లచెదురు అయిపోయే పరిస్థితి కనిపిస్తోంది. మొత్తమ్మీద జిల్లా బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ పగ్గాలు చేజారక మౌనముద్ర దాలుస్తుండటం .. కేసీఆర్ ఫాం హౌస్‌కే పరిమితమవ్వడం, తమ నేతలు అడ్రస్ లేకుండా పోవడంతో జిల్లా పార్టీ శ్రేణులు ఏ చిన్న పని వచ్చినా దిక్కులు చూడాల్సి వస్తోందంట.

# భారత్ బలగాల సమిష్టి విజయం ఇది




న్యూఢిల్లీ,ఆపరేషన్ సిందూర్ సమయంలో ఒకేసారి మేడు దేశాలతో యుద్ధం చేయాల్సి వచ్చిందని భారత డిప్యూటీ ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ ఆపరేషన్ సింధూర్ నిర్వహించిన సమయంలో పాకిస్థాన్‌కు చైనా, టర్కీలు మద్దతుగా నిలిచాయన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఫిక్కీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూ ఏజ్ మిలటరీ టెక్నాలజీస్ అనే అంశంపై లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన సమయంలో పాకిస్థాన్‌ను చైనా ఎప్పటికప్పుడు సమాయత్తం చేసిందన్నారు. భారత్‌కు ఒక సరిహద్దు.. ఇద్దరు శుత్రువులు ఉన్నారన్నారు. కానీ నిజానికి ముగ్గురు శత్రువులు అని ఆయన వివరించారు. అందులో పాకిస్థాన్ ముందు వరుసలో ఉందని పేర్కొన్నారు. పాకిస్థాన్‌కు చైనా అన్ని విధాలుగా మద్దతు ఇస్తుందన్నారు. పాకిస్థాన్ మిలటరీ వినియోగిస్తున్న హార్డ్‌వేర్‌లో 81 శాతం చైనాకు చెందినవేనని ఈ సందర్భంగా ఆయన సోదాహరణగా వివరించారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నడుమ భారత్‌పై పాక్ నిర్వహించిన దాడుల్లో చైనా తన ఆయుధాలను పరీక్షించుకుందని చెప్పారు. అదే సమయంలో పాకిస్థాన్‌కు టర్కీ సైతం అదే తరహాలో సహాయం చేసిందన్నారు. ఈ యుద్ధంలో టర్కీ పైలట్లు నేరుగా పాల్గొన్నారని వివరించారు. పాక్, చైనాను ఎదుర్కొవడానికి బలమైన వాయు రక్షణ వ్యవస్థ ఉండాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా ఆయన నొక్కి చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాద స్థావరాలను గుర్తించి.. వాటిని ధ్వంసం చేయడంలో కీలక పాత్ర పోషించిన భారత సైనిక బలగాలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అలాగే ఈ ఆపరేషన్ సిందూర్ వల్ల కొన్ని పాఠాలను సైతం నేర్చుకున్నామని చెప్పారు. మానవ మేథస్సుతోపాటు సాంకేతిక ద్వారా లెక్కలేనంత సమాచారాన్ని సేకరించి.. ఈ దాడులు నిర్వహించామని లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ వివరించారు. గతంలో మాత్రం ఇలా సమాచారాన్ని సేకరించడంలో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్న మాట మాత్రం వాస్తవమన్నారు. అయితే పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో 21 లక్ష్యాలను గుర్తించి.. వాటిలో తొమ్మిది స్థావరాలను ధ్వంసం చేశామన్నారు. అందుకు చివరి రోజు.. చివరి నిమిషంలో ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన వివరించారు. త్రివిధ దళాలు ఐక్యత కారణంగానే ఇది సాధ్యమైందన్నారు. ఎప్రిల్ 22వ తేదీన జమ్మూ కశ్మీర్‌లోని పహల్గంలో పర్యాటకులే లక్ష్యంగా జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించారు. ఈ ఘటనకు తామే బాధ్యులమంటూ లష్కరే తోయిబాకు చెందిన ది రిసిస్టెన్స్ ఫ్రెంట్ ప్రకటించింది. దీంతో ఈ ఘటనకు కర్త, కర్మ, క్రియా అంతా పాకిస్థాన్ అని భారత్ నమ్మింది. దీంతో పాక్‌కు వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అదే సమయంలో పాక్ సైతం భారత్‌కు వ్యతిరేకంగా పలు నిర్ణయాలు తీసుకుంది. ఇక పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించింది. ఆ క్రమంలో తొమ్మిది స్థావరాలను ధ్వంసం చేసి.. 100 మందికి పైగా ఉగ్రవాదులును హతమార్చిన సంగతి తెలిసిందే.

# రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం



కరీంనగర్ , కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ప్రధాని మోదీ వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశీయ బ్యాంకుల్లో కోట్లాది రూపాయలు తీసుకొని వాటిని తిరిగి చెల్లించకుండా ఎగ్గొట్టి విదేశాలలో జల్సాలు చేస్తున్న విజయ్ మాల్యా, నీరజ్ మోదీలను దేశానికి రప్పించడంలో ప్రధాని విఫలమయ్యారన్నారు. కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్ తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. శత్రుదేశం పాకిస్తాన్‌తో చర్చలు జరిపిన కేంద్ర ప్రభుత్వం.. మావోయిస్టులతో ఎందుకు చర్చలు జడపడం లేదో సమాధానం చెప్పాలన్నారు. విలువైన అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి ప్రధాని మోడీ,హొం శాఖ మంత్రి అమిత్ షా కుట్రలు చేస్తున్నారని విమర్శించా రు.రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ పథకాలు అందించాలని కోరుతూ ఈ నెల 15 నుంచి 20 వరకు అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు తమ పార్టీ తరపున వినతి పత్రం అందిస్తామన్నారు. రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టులపైన ప్రభుత్వం దృష్టి సారించి నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని ప్రభుత్వానికి సూచించారు.

Printed, Published & Owned by MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From SPOORTHI PUBLICATIONS, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: MEDE SHANTHI KUMAR.